
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
సోమవారం 28 అక్టోబరు 2024



విలువలతో కూడిన విద్య బోధిస్తున్నాం

సత్యసాయి పాఠశాలల ఉపాధ్యాయులు



డాక్టర్ బీజీ పిట్రేను సన్మానిస్తున్న ట్రస్టు సభ్యులు

పుట్టపర్తి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి పాఠశాలల్లో విలువలతో కూడిన బోధిస్తున్నట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. స్థానిక సాయికుల్వంత్ సభామందిరంలో సత్యసాయి జాతీయ పాఠశాలల మండలి వర్క్‌షాపు రెండోరోజు ఆదివారం కొనసాగించారు. సత్యసాయి బోధనలు, ప్రేమతత్వం, ఆధ్యాత్మికతపై విద్య అందిస్తున్నామని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. తద్వారా 99 స్కూళ్లలో వేలాదిమంది విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందించగలిగామన్నారు. అనంతరం సత్యసాయి పాఠశాలల్లో సుదీర్ఘకాలం సేవలు అందించిన వారికి విశిష్టగురుజన్ సన్మాన్ అవార్డు అందించి, సన్మానించారు. దాదాపు ఐదు దశాబ్దాలుగా కొనసాగుతున్న డాక్టర్ బీజీ పిట్రేను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సభ్యుడు చక్రవర్తి సన్మానించారు. అనంతరం గాయకులు మాధవి, కౌసల్యబృందం భక్తిపాటలు ఆలపించింది. సాయంత్రం భక్తులు, యువత సత్యసాయి ప్రేమతత్వంపై సంగీత నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

రహదారులు రక్తసిక్తం..



ఇంటిని ఢీకొన్న కారు

జిల్లాలో రహదారులు రక్తసిక్తమయ్యాయి. ఆదివారం వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మరణించగా.. నలుగురు గాయపడ్డారు. మృతుల్లో ఒక చిన్నారి ఉంది. మృతుల కుటుంబీకులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. ఆయా కుటుంబాల్లో విషాదం అలుముకుంది.

వివరాలు 9వ పేజీలో...

బయటపడుతున్న

డంపులు..

నంబులపూలకుంట మండలంలో బయటపడిన ఎర్రచందనం దుంగలు



- వైసీపీ పాలనలో యథేచ్ఛగా ఎర్రచందనం రవాణా
- కదిరి మీదుగా కర్ణాటకకు..
- కూటమి పాలనలో ముమ్మర తనిఖీలు
- వెలుగులోకి వస్తున్న నిల్వలు



కదిరి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో ఎర్రచందనం అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగిందన్నది బహిరంగ రహస్యమే. అడిగేవారు లేరు.. అడ్డుకునేవారు లేరన్న రీతిలో సాగింది. కదిరి మీదుగా ఎర్రచందనం దుంగల అక్రమ రవాణా నిత్యం కొనసాగుతుండేది. అన్నమయ్య, కడప జిల్లాల సరిహద్దుగా ఉండడమే ఇందుకు కారణం. ఈ ప్రాంతం మీదుగా కర్ణాటకకు సురక్షితంగా తరలించేవారు. దీంతో అన్నమయ్య జిల్లా రాజంపేట, రాయచోటి, కడప జిల్లా నుంచి ఎర్రచందనం దుంగలను తీసుకొచ్చి, కదిరి నియోజకవర్గంలోని తలుపుల, నంబులపూలకుంట, తనకల్లు మండలాల్లో నిలువ చేసినట్లు సమాచారం. అనువైన సమయంలో దుంగలను తనకల్లు మీదుగా కర్ణాటకకు చేరుస్తున్నట్లు సమాచారం. మొత్తం మీద గత ఐదు సంవత్సరాల్లో ఒక్కసారి కూడా ఎర్రచందనం దుంగలు ఈప్రాంతంలో పట్టుబడిన దాఖలాల్లేవనే చెప్పాలి. ఇందుకు పోలీసులు, అటవీశాఖ తనిఖీలు లేకపోవడమే కారణమన్న ఆరోపణలున్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నారు. తనిఖీలు విపరీతమయ్యాయి. దీంతో ఎర్రచందనాన్ని డంపుల నుంచి తరలించే అవకాశం లేకుండా పోయింది. అవి ఇప్పుడు జిల్లాలో బయటపడుతున్నాయి.

సురక్షితంగా కర్ణాటకకు..

అన్నమయ్య, కడప జిల్లాల నుంచి ఎర్రచందనాన్ని అక్రమ రవాణా చేయడానికి కదిరి ప్రాంతం సురక్షితమైనదిగా రవాణాదారులు ఎంచుకున్నారు. నంబులపూలకుంట నుంచి పెడబల్లి మీదుగా తనకల్లు మండలంలోని కొక్కంటిక్రాస్ పక్కనే ఉన్న కర్ణాటకకు తరలిస్తున్నట్లు సమాచారం. ఈప్రాంతంలో పోలీసు, అటవీశాఖ చెక్‌పోస్టులు లేవు. తలుపుల నుంచి గాండ్లపెంట, మల్లమీదపల్లి, తనకల్లు మండలం నుంచి కర్ణాటకు రవాణా చేసేవారని తెలుస్తోంది.

గత ఐదేళ్లూ తనిఖీలు నిల్

ఐదు ఐదేళ్ల వైసీపీ పాలనలో కదిరి ప్రాంతంలో ఎర్రచందనం పట్టుబడిన సందర్భాలు ఒకట్రెండు మాత్రమే ఉన్నాయి. తనిఖీలు లేకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. అప్పట్లో అటవీ శాఖ చెక్‌పోస్టు లేకపోవడంతో యథేచ్ఛగా ఎర్రచందనం రవాణా సాగినట్లు సమాచారం. ఎర్రచందనం వాహనాలను ఈ ప్రాంతం మీదుగా కర్ణాటకకు తరలించడానికి స్థానికులు కొంతమందిని ఏజెంట్లుగా నియమించుకుని, సరఫరా చేసినట్లు తెలుస్తోంది. తనిఖీలు లేకపోవడం, నిఘా కొరవడడంతో అక్రమ రవాణా కొనసాగినట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఎర్రచందనం అక్రమ రవాణాపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో ఎర్రచందనం డంపులు బయటపడుతున్నాయి. కొన్నిరోజుల క్రితం చిత్తూరు జిల్లాలో కూడా ఎర్రచందనం డంపు బయటపడింది. తాజాగా నంబులపూలకుంట మండలంలోని నల్లగుట్టపల్లి తండాకు వెళ్లే దారిలో 21 దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలు ముమ్మరం అయ్యాయని చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ. అటవీ, పోలీసు శాఖల అధికారులు దృష్టి పెడితే అక్రమ రవాణాకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయవచ్చన్న వాదనలు వినిపిస్తున్నాయి.

టపాసులు వచ్చేశాయ్..!



- పురం శివారులోని గోదాముల్లో నిల్వ
- తెరచాటున విక్రయాలు ప్రారంభం
- ట్రేడర్స్ నుంచి కొంటున్న హోల్‌సేల్ వ్యాపారులు

హిందూపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దీపావళి సందడి మొదలైంది. పండుగకు వారం ముందే వర్షం తెరిపివ్వడంతో టపాసుల వ్యాపారుల మొహాల్లో ఆనందం వెల్లివిరుస్తుంది. మూడు నెలల ముందే టపాసుల వ్యాపారులు.. తమిళనాడులోని శివకాశికి వెళ్లి భారీఎత్తున టపాసులు కొనుగోలు చేశారు. 15రోజుల క్రితం నుంచే భారీగా జిల్లాకు దిగుమతి చేసుకున్నట్లు తెలుస్తోంది. హిందూపురంలో అత్యధికంగా టపాసుల విక్రయాలు సాగుతాయి. ఈ పరిస్థితుల్లో శివకాశి నుంచి హిందూపురానికి భారీఎత్తున దిగుమతి చేసుకున్నారు. గతంలో 20 నుంచి 30 మంది మాత్రమే షాపుల కోసం దరఖాస్తు చేసుకునేవారు. వీరిలో పది నుంచి 15 మంది మాత్రమే షాపు ఏర్పాటు చేసుకునేవారు. ఈసారి ఏకంగా 56 మంది షాపుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అంటే గతంతో పోల్చితే ఈసారి హిందూపురానికి మూడింతల సరుకు అధికంగా వచ్చినట్లు తెలుస్తోంది. దిగుమతి చేసుకున్న సరుకును శివారు ప్రాంతాల్లోని గోదాముల్లో నిలువ చేసుకుని, వ్యాపారులు ఇప్పుడిప్పుడే బయటకు తీస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం భారీ ట్రేడర్ల నుంచి హోల్‌సేల్, రీటైల్ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. తెరచాటునే ఈ వ్యాపారం సాగుతోంది.

మొదలైన కోలాహలం

హిందూపురంలో 56 మందికి టపాసుల విక్రయాలకు అనుమతి ఇస్తామని అధికారులు చెప్పడంతో వారంతా వ్యాపారం ప్రారంభించే పనిలో నిమగ్నమయ్యారు. దీపావళి సమీపిస్తుండటంతో హోల్‌సేల్, రీటైల్ విక్రయాలు సాగించేందుకు వీలుగా సరుకు సిద్ధం చేసుకుంటున్నారు. హిందూపురంలో నిలువ చేసుకునేందుకు ఒకరిద్దరు వ్యాపారులకు మాత్రమే అనుమతి ఉంది. మిగిలిన వారు నిబంధనలకు విరుద్ధంగా స్టాక్ పెట్టుకున్నారు. లైసెన్స్ వ్యాపారంలో కూడా భారీ ఎత్తున వ్యాపారం చేసేవారున్నారు. వీరంతా ఈ వ్యాపారంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇటీవల వర్షాలు కురిశాయి. నాలుగైదురోజులుగా తెరిపివ్వడంతో వ్యాపారుల్లో ఆశలు చిగురించాయి. పండగ రోజు కూడా వర్షాలు ఉండకపోవచ్చన్న వాతావరణ శాఖ సూచన వారిలో ఉత్సాహం రెట్టింపవుతోంది.

ఎంజీఎంలో స్టాల్స్ ఏర్పాటుకు సన్నాహాలు

హిందూపురంలో దరఖాస్తు చేసుకున్నవారికి లాటరీలో షాపులు కేటాయించారు. ఆ వ్యాపారులంతా ఎంజీఎం క్రీడామైదానంలో స్టాక్ ఏర్పాటు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఆదివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో దుకాణాలు ఏర్పాటు చేసుకునే వ్యాపారులకు సీఐ రాజగోపాల్‌నాయుడు కొన్ని సూచనలు, సలహాలు తెలియజేశారు. మండల వ్యాప్తంగా బాణసంచా స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖతోపాటు పట్టణాల్లో మున్సిపాలిటీ, మండలాల్లో పంచాయతీ అధికారుల అనుమతులు తప్పనిసరి. ఈసారి హిందూపురం పట్టణంలో గతం నుంచి టపాసుల వ్యాపారంతోపాటు రాజకీయ నాయకులు, కార్యకర్తలు కూడా దరఖాస్తు చేసుకోవడం కొసమెరుపు.

టపాసుల అక్రమ నిల్వ, విక్రయాలపై చర్యలు: ఎస్పీ రత్న

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా జిల్లాలో టపాసులు నిల్వ ఉంచినా, విక్రయాలు సాగించినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ రత్న హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. భద్రతాప్రమాణాలు పాటిస్తూ టపాసుల విక్రయాలు చేపట్టాలన్నారు. అనుమతులు పొందిన వారు నిర్దేశించిన ప్రదేశాల్లోనే దుకాణాలు ఏర్పాటుచేసుకోవాలన్నారు. నీరు, ఇసుక తదితర అగ్నిమాపక సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అనుమతులు లేకుండా దీపావళి మందుగుండు సామగ్రి కలిగి ఉన్నా, తయారుచేసినా, అనధికార ప్రాంతాల్లో నిల్వ చేసినా, విక్రయించినా అటువంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. టపాసుల అక్రమ నిల్వలు, విక్రయాలపై సమాచారం అందించాలనీ, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ ప్రకటించారు.

వేరుశనగ రైతుకు నిరాశే

- గిట్టుబాటుపై భరోసా ఇవ్వని ప్రభుత్వం
- అమాంతం పడిపోయిన ధర
- ఆందోళనలో రైతులు

9

పూజారులందరికీ సాయం అందించాలి

ఆదిశక్తి పీఠం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు లక్ష్మీవరప్రసాద్



మాట్లాడుతున్న లక్ష్మీవరప్రసాద్

గోరంట్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పూజారులందరికీ ప్రభుత్వం సాయం అందించాలని ఆదిశక్తి పీఠం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు లక్ష్మీవరప్రసాద్ కోరారు. ఇందుకోసం పూజారుల సంక్షేమసంఘం పోరాటం చేస్తుందన్నారు. మండలంలోని వెంకటరమణపల్లిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో జిల్లాస్థాయి తెలుగు పూజారుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మీవరప్రసాద్ మాట్లాడుతూ.. ఆలయాల్లో పూజలు చేసేవారంతా పూజారులేననీ, కులాలతో సంబంధం లేదన్నారు. కొన్ని ప్రభుత్వాలు వారిని కించపరిచేలా వ్యవహరిస్తున్నాయన్నారు. పూజారి అంటే ఒకే కులానికి చెందినవారంటూ మిగిలినవారిని తక్కువ చేసి చూడడం సరికాదన్నారు. పూజారులకు ప్రభుత్వం అందించే సాయం అర్హులైన ప్రతిఒక్కరికీ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆదిశక్తి పీఠం జిల్లా అధ్యక్షుడు శివరాం, అధిక సంఖ్యలో పూజారులు పాల్గొన్నారు.

ఇవేం పనులు..?

- వీఆర్ఏలతో సిమెంటు పనులు
- తహసీల్దార్ కార్యాలయంలో చోద్యం



తహసీల్దార్ కార్యాలయం వద్ద సిమెంటు కలుపుతున్న వీఆర్ఏ

తనకల్లు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ సహాయకుల(వీఆర్ఏ)లతో సిమెంటు పని చేయించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని వీఆర్ఏలను రెవెన్యూ అధికారులు ఆదివారం తహసీల్దార్ కార్యాలయానికి రప్పించి, పారిశుధ్య, సిమెంటు పనులు చేయించారు. అందుకు సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. తమతో సిమెంటు పనులు చేయించడం ఏంటని వీఆర్ఏలు వాపోతున్నారు. కార్యాలయంలోకి పాములు వస్తున్నాయని సిమెంటు పనులు చేయించారు. ఇందులో భాగంగా సిమెంటు కలిపే పని వీఆర్ఏలతో చేయించడం విమర్శలకు తావిస్తోంది.

గిట్టనివారి ప్రచారం

కార్యాలయాన్ని శుభ్రం చేసి, రికార్డులను సక్రమంగా ఉంచుకునేందుకు వీఆర్ఏలు వచ్చారు. పాములు కార్యాలయంలోకి వస్తుండడంతో బేల్దారిని పిలిపించి, సిమెంటు పనిచేయిస్తున్నాం. సిమెంటు పనిచేయమని ఎవ్వరికీ చెప్పలేదు. కార్యాలయంలో డ్యూటీలు వేస్తుంటే, నచ్చనివారు నాపై ఇలా ప్రచారం చేస్తున్నారు.

-శోభాసువర్ణమ్మ, తహసీల్దార్, తనకల్లు

ఏడుస్తూనే హరినామ సంకీర్తన చేస్తున్న ఇస్కాన్ భక్తులు





శ్రీధర్ ప్రభు కుమారుడు కృష్ణ



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఇస్కాన్ భక్తుల భౌతికకాయాలను దర్శించుకునేందుకు వచ్చిన జనం



శంఖం ఊదుతున్న భక్తుడు



రోదిస్తున్న ప్రణవ్ సోదరుడు భువన్

జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు

బరువెక్కిన హృదయాలతో అంతిమ సంస్కారాలు

కన్నీటి వీడ్కోలు

ఇస్కాన్ భక్తులకు వేలాదిగా నివాళి



ప్రణవ్ భౌతికకాయం వద్ద రోదిస్తున్న తల్లి చంద్రలేఖ

నిత్యం శ్రీకృష్ణ నామ స్మరణలతో... తన్మయత్వం చెందిన భక్తుల నృత్యాలతో ఆనంద తరంగాలతో శోభించిన ఆ ప్రాంతం గుండెలు పగిలే బాధతో శోకించింది.

శ్రీకృష్ణ నామ సంకీర్తనలతో ఎందరిలోనో భక్తి భావం మేల్కొలిపిన ఆ భక్త బృందం లేరని తెలిసి ఉబికి వస్తున్న కన్నీటితో శోక సంద్రమైంది.

భక్తుల బృందగానాలతో అలరారిన శ్రీ కృష్ణ మందిరం పట్టరాని బాధతో బరువెక్కిన హృదయాలకు వేదికైంది.

గుండెల్లో ప్రజ్వరిల్లుతున్న బడబాగ్నిని ఉబికి వస్తున్న కన్నీళ్లతో చల్లార్చుకుంటూ వాయులీనమై, పరాంధాముడిలో ఐక్యమైన భక్తశేఖరులకు తుది వీడ్కోలు పలికింది.

నార్పల మండలం నాయనపల్లి క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇస్కాన్ మందిర భక్త బృందానికి ఆదివారం తుది వీడ్కోలు పలికారు. భక్తుల సందర్శనార్థం మృతదేహాలను ఇస్కాన్ మందిరం వద్ద ఉంచారు. కుటుంబ సభ్యులు, బంధువులు, భక్తుల రోదనలతో ఆ ప్రాంతం శోక సంద్రమైంది.



బాధాతప్త హృదయంతో శ్రీకాకుళం పయనమవుతున్న షణ్ముఖ్ తండ్రి సాంబమూర్తి

అనంతపురం కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇస్కాన్ మందిర భజన బృంద సభ్యులకు వందలాదిమంది నడుమ ఆదివారం కన్నీటి వీడ్కోలు పలికారు. తాడిపత్రిలోని ఓ గృహంలో శనివారం శ్రీకృష్ణ సంకీర్తన నిర్వహించి తిరిగి అనంతపురానికి వస్తుండగా నాయనపల్లి క్రాస్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దీంతో శ్రీనివాసులు అలియాస్ శ్రీధర్, షణ్ముఖ్, సంతోష్‌కుమార్, వెంకటేష్, లక్ష్మీప్రసన్న కుమార్‌రెడ్డి, ప్రనీత్ ప్రణవ్ సాయిరెడ్డి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటన జిల్లా ప్రజలకు దిగ్భ్రాంతి కలిగించింది. మృతదేహాలకు ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఆదివారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం భౌతికకాయాలను ఇస్కాన్ భక్తుల సందర్శనార్థం నగర శివారులోని ఇస్కాన్ మందిరానికి తరలించారు. ఈ సందర్భంగా మృతుల బంధువులతోపాటు వందలాదిమంది ఇస్కాన్ మందిరానికి చేరుకుని తుదివీడ్కోలు పలికారు. మృతులంతా ఇస్కాన్ మందిర సేవలో ఉన్న వారే కావడంతో భక్తులంతా కన్నీరు మున్నీరయ్యారు.

జిల్లా నలుమూలల నుంచి కదిలొచ్చిన భక్తజనం

ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఈ బృందం చురుగ్గా పాల్గొనేవారు. ప్రధానంగా నగర సంకీర్తనల్లో ఎంతో ఉత్సాహంగా భక్తిగీతాలాపనలు చేస్తూ భక్తుల్లో ఎంతో ఉత్సాహం రేకెత్తించేవారు. జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో వీరు నగర సంకీర్తనలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా అనేక మంది భక్తులతో వీరికి ఎంతో అనుబంధం ఏర్పడింది. వీరి మృతి విషయం తెలుసుకొని జిల్లావ్యాప్తంగా ఈ బృందంతో ఆధ్యాత్మిక అనుబంధం కలిగినవారంతా వందలాదిగా తరలి వచ్చి భౌతికకాయాలను సందర్శించి కన్నీటి పర్యంతమయ్యారు.



భౌతికకాయాల వద్ద హరేకృష్ణ... హరేరామ నామస్మరణ చేస్తున్న ఇస్కాన్ బృందం

బరువెక్కిన హృదయాలతో అంతిమ సంస్కారాలు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇస్కాన్ భక్తులకు బంధువులు, భక్తుల సమక్షంలో బరువెక్కిన హృదయాలతో కుటుంబ సభ్యులు అంతిమ సంస్కా రాలు నిర్వహించారు. ఉబికివస్తున్న కన్నీళ్లను అదుపు చేస్తూ, గుండెలు పగిలే బాధ ఉన్నప్పటికీ హరేరామ, హరే కృష్ణ అంటూ సంకీర్తన సాగించారు. శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పహాడ్‌పల్లి గ్రామానికి చెందిన షణ్ముఖ్, నాగిరెడ్డిపల్లికి చెందిన లక్ష్మీప్రసన్న కుమార్‌రెడ్డి మృతదేహాలను వారి తల్లిదండ్రులు ప్రత్యేక అంబులెన్సుల ద్వారా వారి స్వస్థలాలకు తీసుకెళ్లారు. అనంతరం శ్రీధర్ ప్రభు, సంతోష్‌కుమార్, వెంకటేష్, ప్రనీత్‌ప్రణవ్ సాయిరెడ్డి భౌతికకాయాలను కైలాస రథాల్లో ఉంచి నగరంలో అంతిమయాత్ర నిర్వహిస్తూ గుత్తిరోడ్డులోని హరిశ్చంద్రఘాట్‌కు తరలించారు. అక్కడ హిందూ సంప్రదాయ పద్ధతిలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.



శ్రీధర్ మృతదేహం వద్ద కన్నీటి పర్యంతమవుతున్న ఆయన సతీమణి దివ్య

నా ప్రభువును నా వద్దే ఉంచండి

దివ్య, శ్రీధర్ ప్రభు(శ్రీనివాసులు) సతీమణి

పెళ్లయిన ఐదేళ్లకే భర్తను కోల్పోయి, భర్త మృతదేహంపై పడి రోదిస్తున్న దివ్య ఓదార్చడం ఎవరివల్లా కాలేదు. నాలుగేళ్ల నా కుమారుడు కృష్ణ ముచ్చట కూడా చూడకుండానే తండ్రి లేకుండా చేసావా భగవంతుడా. మేమెవరికోసం బతకాలి దేవుడా అంటూ శ్రీధర్ ప్రభు(శ్రీనివాసులు) సతీమణి ఏడుపు చూసిన వారంతా కంట తడి పెట్టుకున్నారు. నా శ్రీధర్ ప్రభువును నావద్దనే ఉంచండి... ఎక్కడికీ తీసుకెళ్లద్దండి అంటూ ఆమె ఏడవడం అందరినీ కలచివేసింది.

కంటతడి పెట్టిన ఎమ్మెల్యే దగ్గుపాటి



ఇస్కాన్ మందిరం వద్ద ఏర్పాటు చేసిన ఇస్కాన్ భక్తుల మృతదేహాలను చూసి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా మృతుల భౌతికకాయాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చే ప్రయత్నం చేశారు. అయితే వారి రోదనలను చూసి ఆయనకూడా కన్నీరు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ శ్రీకృష్ణుని సేవలో ఉన్న యువకులంతా ఇలా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. వారి కుటుంబాలను ఆదుకుంటామన్నారు.



ఇస్కాన్ భక్తులకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్



ఇస్కాన్ భక్తుల అంతిమయాత్ర



అంబులెన్సులో షణ్ముఖ్ భౌతికకాయాన్ని శ్రీకాకుళానికి తరలిస్తున్న దృశ్యం

వీరి కీర్తనలు వినేందుకే భగవంతుడు తీసుకెళ్లాడు



శ్రీధర్ ప్రభు బృందం పాడే కీర్తనలు చాలా మందిలో భక్తిభావాలు కలిగించాయి. వీరి కీర్తనలను ఇష్టపడనివారుండరు. అందుకే నేమో శ్రీకృష్ణ పరమాత్ముడు కూడా వీరి కీర్తనలను వినాలని తనదగ్గరకు తీసుకెళ్లాడేమో..! అనంతపురంలో ఇస్కాన్ మందిర ఆరంభం నుంచి సభ్యుడిగా కొనసాగుతున్నాను. వీరి మృతి నా జీవితంలో ఏనాడూ కలగనంత మనోవేదనను మిగిల్చింది.

-శ్రీపాద వేణు, ఇస్కాన్ అనంతపురం సభ్యుడు



ఫీల్డ్ అసిస్టెంట్ పట్టా చేయించుకుని సాగుచేస్తున్న భూమి

ఫీల్డ్ అసిస్టెంట్ మరి..!

- నాలుగెకరాలకు భార్య పేరుతో అక్రమంగా పట్టా
- వైసీపీ పాలనలో ఆన్‌లైన్‌లోకి సైతం..
- బాధితుల ఫిర్యాదుతో ఐదేళ్ల తర్వాత వెలుగులోకి..


యాడికి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉపాధిహామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఒక వ్యక్తి నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమంగా తన భార్య పేరుతో చేయించుకున్న వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యాడికిలోని సర్వే నెంబరు 422-బీలో ప్రభుత్వ మిగులు భూమి సుమారు 40ఎకరాలు ఉంది. ఇందులో కొంతభాగం ఏడు నెంబర్లలో వివిధ వ్యక్తులకు పట్టాలు ఇచ్చారు. ఈ భూములపై కన్నేసిన ఫీల్డ్ అసిస్టెంట్ ధనాంజనేయులు 2019లో ఎన్నికల విధుల నిమిత్తం యాడికికి వచ్చిన ఒక అధికారిని ప్రలోభ పెట్టి తన భార్య పేరుతో నాలుగు ఎకరాల భూమిని పట్టా చేయించుకొని ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నాడు. ఇదే భూమిని గతంలో చిన్నబాలన్న అనే దళితుడికి ఇచ్చి ఉన్నారు. అతడి కుటుంబికులు ఈ భూమి విషయమై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఫీల్డ్ అసిస్టెంట్ భూబాగోతం వెలుగులోకి వచ్చింది. దీనిపై ఆరాతీసిన రెవెన్యూ అధికారులు సదరు ఫీల్డ్ అసిస్టెంట్‌కు మూడు నోటీసులు ఇచ్చినప్పటికీ స్పందించ లేదని తెలిసింది. దీనిపై రెవెన్యూ అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఒత్తిడి చేయడంతో అతను వైసీపీ నాయకులను ఆశ్రయించినట్లు సమాచారం. దీంతో ఓ వైసీపీ నాయకుడు తన అనుచరులతో రెవెన్యూ కార్యాలయానికి వచ్చి గ్రామస్థాయి రెవెన్యూ అధికారిని బెదిరించినట్లు కార్యాలయ సిబ్బంది చర్చించుకుంటున్నారు.



ఫీల్డ్ అసిస్టెంట్‌కు రెవెన్యూ అధికారులు ఇచ్చిన నోటీసు

బెదిరింపులకు లొంగని రెవెన్యూ సిబ్బంది

ఫీల్డ్ అసిస్టెంట్ భూ ఆక్రమణను అరికట్టే దిశలో బెదిరింపులు ఎదురైనా రెవెన్యూ సిబ్బంది లొంగకుండా చర్యలు చేపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఆక్రమించిన భూమిని గతంలో రెవెన్యూ అధికారులు పట్టా ఇచ్చిన వ్యక్తులకు చెందేలా చర్యలకు ఉపక్రమించారు. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్ రెవెన్యూ అధికారులతో బేరసారాలకు దిగినట్లు స్థానికంగా చర్చించుకుంటున్నారు. తాను పట్టా చేయించుకున్న నాలుగు ఎకరాల భూమిలో హరిజన చిన్నబాలన్నకు ఉన్నది రెండు ఎకరాల భూమి మాత్రమే అని, మిగిలిన భూమి తన భార్య పేరుతో అలాగే ఆన్‌లైన్‌లో ఉంచాలని వేడుకున్నట్లు సమాచారం. దీనికి లొంగని రెవెన్యూ అధికారులు ప్రభుత్వ నిబంధనల మేరకు మిగులు భూములు ప్రభుత్వానికి చెందాల్సిందేనని చెప్పినట్లు సమాచారం. అలాగే తాను ఆక్రమించుకున్న భూమికి తనకు ఎటువంటి సంబంధం లేదని లేఖ కూడా రాయించుకున్నట్లు తెలిసింది. దీనిని ఉన్నతాధికారులకు నివేదించి ఫీల్డ్ అసిస్టెంట్ ఆక్రమించుకున్న భూమిని స్వాధీనం చేసుకొనే దిశగా రెవెన్యూ అధికారులు చర్యలు చేపడుతున్నారు.



సదరు భూమిని ఆన్‌లైన్‌లో ఫీల్డ్ అసిస్టెంట్ తన భార్య పేరుతో నమోదు చేయించుకున్న దృశ్యం

రెవెన్యూ అధికారికి వైసీపీ హెచ్చరిక

ఫీల్డ్ అసిస్టెంట్ భూ ఆక్రమణకు మద్దతుగా పదిరోజుల కిందట వైసీపీ నాయకులు రెవెన్యూ కార్యాలయానికి పెద్దఎత్తున వచ్చారు. గ్రామస్థాయిలో ఉండే రెవెన్యూ అధికారిని హెచ్చరించినట్లు స్థానికుల సమాచారం. ఇక్కడి నుంచి నీవు బదిలీ అయినా ఇంకా ఎందుకు ఇక్కడే ఉంటున్నావ్ వెళ్లి పోవచ్చు కదా అని ఆ అధికారిని పరుష పదజాలంతో హెచ్చరించారు. మా ఉన్నతాధికారులు నన్ను రిలీవ్ చేసినప్పుడు నేను ఇక్కడి నుంచి వెళతాను మీరెవరు నన్ను ప్రశ్నించడానికి అని ఆ అధికారి కూడా దీటుగా సమాధానం ఇచ్చినట్లు చర్చ జరుగుతోంది.

ఫీల్డ్ అసిస్టెంట్‌తో స్టేట్‌మెంట్ తీసుకున్నాం

422-8 భూమిని ఫీల్డ్ అసిస్టెంట్ గతంలో తన భార్య పేరుతో ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్న మాట వాస్తవమే. దీనిపై వారికి నోటీసులు జారీచేశాం. వారి నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నాం. దీనిని ఆర్డీఓ ద్వారా డీఆర్వోకు పంపించాల్సి ఉంది. అధికారుల ఆదేశాలతో ఆ భూమిని ప్రభుత్వానికి చెందేలా చేస్తాం. - రమేష్, వీఆర్వో యాడికి

టపాసులతో జాగ్రత్త

అక్రమంగా విక్రయించినా, నిల్వ ఉంచినా చర్యలు : ఎస్పీ



అనంతపురం క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చట్ట వ్యతిరేకంగా టపాసులు విక్రయించినా, నిల్వ ఉంచినా చర్యలు తప్పవని ఎస్పీ జగదీష్ హెచ్చరించారు. బాణసంచా విక్రయ లైసెన్స్ కలిగిన దుకాణదారులు మాత్రమే టపాసులు విక్రయించాలని, లేని వారు ఎవరైనా అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దీపావళిని పురస్కరించుకుని జిల్లాలో లైసెన్స్ కలిగిన దుకాణదారులు పాటించాల్సిన నియమ, నిబంధనలు, ప్రజలు, పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్పీ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. తాత్కాలిక లైసెన్స్‌దారులు ప్రభుత్వ యంత్రాంగం సూచించిన బహిరంగ ప్రదేశాల్లో నిర్ణీత కొలతల మేరకు ప్రత్యేక షెడ్లలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామగ్రిని తప్పనిసరిగా టపాసుల విక్రయ దుకాణాల్లో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. 18సంవత్సరాలలోపు పిల్లలను విక్రయ పనుల్లో ఉంచుకోరాదన్నారు. నిబంధనలు పక్కాగా పాటించాలన్నారు. పెద్దల పర్యవేక్షణలోనే పిల్లలు టపాసులు కాల్చాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా ప్రమాదం జరిగినా, అక్రమంగా టపాసులు విక్రయిస్తున్నా వెంటనే డయల్-100/112 లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం చేరవేయాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వం 30 శాతం ఐఆర్ ప్రకటించాలి

పీఆర్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గిరిప్రసాద్

అనంతపురం విద్య, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీ రిపోర్ట్ వచ్చేలోపు ఉద్యోగులు,ఉపాధ్యాయులకు దీపావళి కానుకగా వెంటనే 30 శాతంఐఆర్ ప్రకటించాలని పీఆర్టీయూ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గిరి ప్రసాద్ కోరారు. ఆదివారం ఆ సంఘం నాయకులు యూనియన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక ఉద్యోగులకు, ఉపాధ్యాయులు జీతాలు వెంటనే వేస్తుండటం హర్షణీయమన్నారు. ఈ ప్రభుత్వంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు. పీఆర్సీ ఆలస్యమైతే ఐఆర్ ఇచ్చే సంస్కృతిని గతంలో మొట్టమొదట 1999లో సీఎం చంద్రబాబు తీసుకొచ్చారని గుర్తు చేశారు. 2023 జూలై నుంచి అమలు కావాల్సిన 12వ పీఆర్సీ ఆలస్యమవుతోందన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు తాత్కాలిక భృతి ప్రకటించి, వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, జిల్లాప్రధానకార్యదర్శి తిమ్మారెడ్డి, రాష్ట్ర సీపీఎస్ కన్వీనర్ తిరుపాల్, శివారెడ్డి, ఎల్లప్ప, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిరిప్రసాద్

చిన్నారి పెళ్లికూతురు

పాపంపేటలో బాల్యవివాహం...!

అనంతపురం విద్య, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉండే ఓపేటలో బాలికకు వివాహం చేసినట్లు తెలిసింది. తల్లిదండ్రులు తమ 14 ఏళ్ల కుమార్తెకు రహస్యంగా వివాహం చేసినట్లు సమాచారం. అనంతపురం రూరల్ మండలంలో నివాసం ఉంటున్న దంపతులు తమ మైనర్ కుమార్తెను కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన వరుడికి ఇచ్చి ఆదివారం ఉదయం వివాహం చేసినట్లు తెలుస్తోంది. ఇటీవలే ఐసీడీఎస్, చైల్డ్ లైన్ అధికారులు బాలిక దంపతులకు కౌన్సెలింగ్ కూడా ఇచ్చినట్లు తెలిసింది. అధికారుల మాటలు బాలిక తల్లిదండ్రులు పెడచెవిన పెట్టి పెళ్లి చేసినట్లు సమాచారం. జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలోనే ఇలా బాలికలకు పెళ్లిళ్లు చేస్తుంటే...ఇక జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో, మారుమూల ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటుందోననే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ బాల్య వివాహంపై ఐసీడీఎస్ పీడీ శ్రీదేవిని వివరణ కోరగా ఇటీవల తమ శాఖాధికారులు వెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చిన విషయం వాస్తవమేనన్నారు. ఒక వేళ రహస్యంగా పెళ్లి చేసి ఉంటే... విచారణ చేయించి వెంటనే కేసు నమోదు చేస్తామని తెలిపారు.



గాయపడిన మహిళ

కార్లపై రాళ్లదాడి

జాతీయ రహదారిపై ఘటన

ఇరువురికి గాయాలు

హిందూపురం, అక్టోబరు, 27(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి వెంట వెళ్తున్న కార్లపై గుర్తుతెలియని దుండగులు రాళ్లదాడి చేశారు. ఈ ఘటనలో కార్లలో ప్రయాణిస్తున్న ఇరువురికి గాయాలైనట్లు బాధితులు తెలిపారు. పెనుకొండకు చెందిన కేదరినాథ్ బెంగళూరుకు వెళ్లి అక్కడ తన కుమార్తెను పండుగ కోసం కార్లో తీసుకువస్తున్నాడు. ఆదివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో సోమందేపల్లి మండలం నల్లగొండరాయనపల్లి సమీపంలోకి వచ్చే సరికి గుర్తు తెలియని దుండగులు కారుపై రాళ్లు విసిరారు. దీంతో బెంబేలెత్తిన వారు కారును ఆపకుండా పెనుకొండకు వెళ్లారు. కారు అద్దాలు ధ్వంసమై కుమార్తె చందనకు గాయాలవగా.. భార్య అశ్విని తల కిందకు దించుకోవడంతో తప్పించుకుంది. పెనుకొండకు చెందిన భగత్ భార్య గోరంట్లకు వెళ్లి కారులో తిరిగి వస్తున్నారు. వీరికి కూడా 10 నిమిషాల వ్యవధిలో చీకట్లో నుంచి రాళ్ల దాడి చేశారు. వీరి వాహనానికి కూడా అద్దాలు పగిలాయి. కారులో ఉన్న బిన్నిశ్రీకి స్వల్ప గాయాలయ్యాయి. వీరు కూడా పెనుకొండ వరకు కారు ఆపకుండా వెళ్లారు. అనంతరం వారు.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లి గాలించారు. ఎవరూ కనిపించకపోవడంతో వెనుతిరిగి వచ్చారు. దీనిపై ఎస్‌ఐ రమేష్‌ను సంప్రదించగా.. చీకట్లో ఉండి ఎవరో రాళ్ల దాడి చేశారనీ, వారు మద్యం మత్తులో చేశారా, ఆకతాయిల పనా తెలియాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడతామని ఎస్‌ఐ పేర్కొన్నారు.



పగిలిన కారు అద్దాలు

పేద విద్యార్థికి ఆర్థికసాయం

గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఔదార్యం



అనంతపురం అర్బన్, అక్టోబరు27(ఆంధ్ర జ్యోతి): ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదవిద్యార్థి ఉన్నత చదువుల కోసం గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొద్దీన్ ఆర్థిక సాయం చేశారు. అనంతపురానికి చెందిన ఓ పేద విద్యార్థిని ఉన్నత చదువులకు ఆదివారం ఆయన రూ.25వేలు ఆర్థిక సాయం అందించారు. కష్ట సమయంలో ఆర్థిక సాయం అందించి, చదువు కొనసాగించడానికి అండగా నిలిచిన గౌస్‌మొద్దీన్‌కు ఆ విద్యార్థి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి

రాయదుర్గంరూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నీటి గుంతలో ఈతకు వెళ్లి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన పట్టణ శివారు బీటీపీ లేఅవుట్‌లో ఆదివారం జరిగింది. ఈ లేఅవుట్‌లో నివాసం ఉం టున్న హరి, వరలక్ష్మి దంపతుల కుమారుడు కళ్యాణ్‌రామ్(19) పిల్లలతో కలిసి కాలనీ సమీపంలోని నీటి గుంత వద్దకు ఈతకు వెళ్లాడు. దరికి ఆనుకుని ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు లోతు ఎక్కువ ఉన్న ప్రాంతానికి వెళ్లి పోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. ఆందోళన చెందిన తోటి వారు గుంత నుంచి ఒడ్డుకు చేరుకున్నారు. ఇంతలోనే ఈతకెళ్లిన కుమారుడు ఎంతసేపటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రు లు బంధువులతో కలిసి కుమారుడిని వెదుకుతూ నీటి గుంత వద్దకు చేరుకుని పరిశీలించారు. నీటి అడుగులో ఉన్న కళ్యాణ్‌రామ్‌ను బయటకు తెచ్చి రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు.

న్యూస్‌బాక్స్

పంచాయతీ స్థలాల అక్రమాలపై కొరడా

అధికారులపై పీఆర్ కమిషనర్ వేటు

ఎంపీడీఓ, కార్యదర్శి సస్పెన్షన్

అనంతపురం విద్య, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ స్థలాల కేటాయింపులో అక్రమాలకు పాల్పడిన అధికారులపై పంచాయతీరాజ్ అధికారులు చర్యలు చేపట్టారు. ఇద్దరు అధికారులపై సస్పెన్షన్ వేటు వేశారు. ఒక ఎంపీడీఓ, మరో పంచాయతీ సెక్రెటరీని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు ఆలస్యంగా వెలుగు చూశాయి. పెద్దవడుగూరు ఎంపీడీఓగా పనిచేస్తున్న బారెన్ సాహెబ్ గతంలో ఉరవకొండలో పంచాయతీ సెక్రెటరీగా పనిచేశారు. అలాగే ఇటీవలి వరకూ రాప్తాడులో పనిచేసి బుక్కరాయసముద్రానికి వచ్చిన గ్రేడ్-1 పంచాయతీ సెక్రెటరీ పెద్ద శ్రీనివాసులు సైతం గతంలో ఉరవకొండలో సెక్రెటరీగా పనిచేశారు. గతంలో వారిద్దరూ పంచాయతీ స్థలాల కేటాయింపులో అక్రమాలకు పాల్పడటంతోపాటు, వాటిని సంరక్షించడంలో విఫలమయ్యారు. దీనిపై ఫిర్యాదులు వెళ్లాయి. సుదీర్ఘకాలం పాటు డీపీఓ, ఇతర అధికారులు విచారణ చేశారు. విచారణలో అక్రమాలు రుజువు కావడంతో ఆ ఇద్దరిపై పీఆర్ కమిషనర్ కృష్ణతేజ క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఎంపీడీఓ, కార్యదర్శులను సస్పెండ్ చేశారు.

మట్టి కోసం కూటమిలో రగడ

టీడీపీ నాయకుల ఎక్స్‌కవేటర్ అద్దాలను పగలకొట్టిన జనసేన నాయకులు

ధర్మవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మట్టి తవ్వకాలపై టీడీపీ, జనసేన నాయకుల మధ్య రగడ మొదలైంది. ధర్మవరం మండలం రేగాటిపల్లిలో ఆదివారం మట్టి అక్రమ రవాణా చేస్తున్న టీడీపీ నాయకులకు చెందిన ఎక్స్‌కవేటర్‌ను జనసేన నాయకులు ధ్వంసం చేశారు. ఇక్కడ మట్టి తవ్వాలంటే తాము తప్ప వేరేవారు రాకూడదని జనసేన నాయకులు హుకుం జారీ చేసినట్టు తెలిసింది. గ్రామ సమీపంలో మట్టి తవ్వి రవాణా చేస్తున్నారు. ఇదే పంచాయతీకి చెందిన పలువురు టీడీపీ నాయకులు తాము కూడా మట్టిని తవ్వుకుంటామని పలుమార్లు జనసేన నాయకులకు విన్నవించామని తెలిపారు. ఇందుకు జనసేన నాయకులు ఒప్పుకోకపోవడంతో రేగాటిపల్లి కొండసమీపంలో మట్టిని తవ్వేందుకు టీడీపీ నాయకులు ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న జనసేన నాయకులు వచ్చి మట్టి తవ్వుతున్న ఎక్స్‌కవేటర్‌పై రాళ్లు విసిరి అద్దాలను ధ్వంసం చేశారు. ఈ ఘటనపై టీడీపీ నాయకులు.. రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ధ్వంసమైన ఎక్స్‌కవేటర్ అద్దం

వేరుశనగ రైతుకు నిరాశే

అమాంతం పడిపోయిన ధర

గిట్టుబాటుపై భరోసా ఇవ్వని ప్రభుత్వం

ఆందోళనలో రైతులు



గాండ్లపెంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎండనక, వాననక కష్టపడే రైతులు సాగుచేసిన పంటలు చేతికందితే సాగుఖర్చులు, పిల్లల చదువులు, జీవనోపాధితోపాటు, చేసిన అప్పులు తీర్చుకోవచ్చని ఎదురు చూస్తుంటారు. ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడలను ఎదుర్కొని అరకొరగా పంట చేసుకొచ్చినా ధర తగ్గిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాండ్లపెంటమండల వ్యాప్తంగా ఈ ఖరీఫ్‌లో వర్షాధారం కింద 3,200 ఎకరాల్లో వేరుశనగ సాగుచేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వేరుశనగ విత్తనకాయలు 40 శాతం సబ్సిడీతో 30కిలోల బస్తా రూ.1,710కు అందించారు. ఎకరా సాగుకు దుక్కి, ఎరువులు, కలుపు, చీడపీడల నివారణకు రూ.20వేలు ఖర్చు చేశారు. వర్షాధారం కింద ఎకరాకు ఐదు బస్తాలు కూడా దిగుబడి రాలేదు. గత యేడాది 44 కి లోల బస్తా ధర రూ.3,500కు పైగా పలికింది. ప్రస్తుతం బస్తా ధర రూ.2వే లకు పడిపోయింది. దీంతో రైతులు పంటలకు పెట్టిన పెట్టుబడులు కూడా అందకుండా పోతున్నాయి. పడిపోయిన ధరలు


మెట్ట ప్రాంత రైతులు

> ఒకప్పుడు మెట్ట ప్రాంతంలో పంట అంటే వేరుశనగే గుర్తొచ్చేది. రానురాను ఆ పంట అంతరించిపోయే పరిస్థితి కనిపిస్తోంది. గతంలో వేరుశనగ సాగు చేసి రాసులు వేసిన రైతులు.. ఇప్పుడు నష్టాలు మూటగట్టుకోవాల్సి వస్తోంది. ఈసారైనా పంట రాకపోతుందా.. కష్టాలు తీరకపోతాయా అనే ఆశతో సాగు చేసిన రైతులకు నష్టాలే మిగిలాయి. ముంగార్లకు మురిపించిన వరుణుడు మధ్యలో ఎగదీసి.. తీరా పంట ఇంటికి చేర్చే సమయంలో కుళ్లబెట్టి నట్టేట ముంచాడు. ఉన్న ధరలు కూడా అమాంతం పడిపోయాయి. ఇతర పంటలలాగే వేరుశనగకు కూడా గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.



వేరుశనగ కాయలు తొలగిస్తున్న కూలీలు

ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగుచేస్తారు. అక్టోబరు నెలలో పంట తొలగిస్తారు. ఈనెలలో అల్పపీడన ప్రభావాలతో భారీ వర్షాలు కురిశాయి. దీంతో పలువురు రైతులు వేరుశనగను తొలగించారు. వర్షానికి తడవడంతో నాణ్యత లోపించింది. మరి కొంత మంది రైతులు పంటను తొలగించి పొలాల్లోనే వదిలివేయడంతో కుళ్లిపోయింది. దీం తో పాటు కా యలు మొలకలొచ్చి నల్లగామారిపోయాయి. నాణ్యత లేవంటూ వ్యాపారులు బస్తా రూ.రెండు వేలకు కొనుగోలు చేస్తున్నారు. ధరలు తగ్గిపోవడంతో ఎలా అమ్మేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వేరుశనగ పంటకు కూడా మద్దతు ధర ప్రకటించి.. కరువు రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



ఇంటివద్ద ఆరబెట్టుకున్న వేరుశనగ కాయలు

పంట ఖర్చులు కూడా రావు : మస్తానప్ప, మునగలవారిపల్లి



నేను రెండున్నర ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వర్షాధారం కింద వేరుశనగ సాగుచేశాను. ఎకరా సాగుకు రూ.20వేలకు పైగా ఖర్చు వచ్చింది. మొత్తం రూ. 50వేలు పెట్టుపెట్టాను. రెండున్నర ఎకరాలకు కనీసం 10 బస్తాలుకూడా దిగుబడి రాలేదు. ఉన్నఫలంగా ధరలు కూడా పడిపోయాయి. ప్రభుత్వం మద్దతుధర ప్రకటిస్తే పెట్టుబడులైనా దక్కుతాయి. ప్రభుత్వం స్పందించి వేరుశనగ రైతులను ఆదుకోవాలి.

వేరుశనగ సాగుచేస్తే నష్టాలే : రామమోహన్, పోతినేపల్లి



వేరుశనగ పంట సాగు చేస్తే నష్టాలే మిగులుతున్నాయి. గతంలో కూరగాయలు, ఇతర పంటలు సాగు చేసి నష్టపోయాం. వేరుశనగ సాగుచేయడం వల్ల పశుగ్రాసం వస్తే కొద్దిగా ఉపయోగం ఉండేది. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా తడిసిపోవడంతో పశుగ్రాసానికి పనికిరాకుండాపోయింది. మరోవైపు ధరలు లేకపోవడంతో గిట్టుబాటు కనిపించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం వేరుశగకు గిట్టుబాటు ధరలు కల్పించాలి.





ట్రోఫీలు అందుకుంటున్న అనంతపురం బాలుర, బాలికల జట్లు

అనంత అద్వితీయం..

ఫుట్‌బాల్‌లో తిరుగులేని జిల్లా జట్లు

రాష్ట్రస్థాయి అండర్-14 టోర్నీలో

చాంపియన్లుగా అవతరణ

హిందూపురం అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా బాలిబాలికలు ఫుట్‌బాల్‌లో అదరగొట్టారు. రాష్ట్రస్థాయి అండర్-14 టోర్నీలో విజేతలుగా నిలిచారు. స్థానిక ఎంజీఎం క్రీడామైదానంలో మూడురోజులపాటు నిర్వహించిన 68వ రాష్ట్ర స్థాయి అండర్-14 ఫుట్‌బాల్ టోర్నీలో బాలబాలికల విభాగాల్లో అనంతపురం జిల్లా జట్లు చాంపియన్‌గా అవతరించాయి. ఆదివారం నిర్వహించిన బాలికల విభాగ ఫైనల్లో అనంతపురం, తూర్పుగోదావరి జిల్లాల జట్లు తలపడ్డాయి. అనంత జట్టు 4-0 గోల్స్ తేడాతో తూర్పుగోదావరి జట్టును చిత్తుచేసి, విజేతగా ఆవిర్భవించింది. తూర్పుగోదావరి రన్నరప్ కాగా.. చిత్తూరు, పశ్చిమ గోదావరి జిల్లాల జట్లు వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి.

బాలురు సైతం..

బాలుర విభాగ ఫైనల్ మ్యాచ్‌లో అనంతపురం, శ్రీకాకుళం జట్లు తలపడ్డాయి. అనంతపురం జట్టు 4-0 గోల్స్ తేడాతో అద్భుత విజయం సాధించింది. చాంపియన్‌గా అవతరించింది. శ్రీకాకుళం రన్నరప్‌గా, విశాఖ, చిత్తూరు జిల్లాల జట్లు వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి.

నవంబరులో జాతీయ స్థాయికి...

టోర్నీలో ప్రతిభ కనబరచిన పలువురిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. నవంబరులో మహారాష్ట్రలోని నాందేడ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో వీరు రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని టోర్నీ నిర్వాహకులు తెలిపారు. అనంతరం విజేత జట్లకు ఎంఈఓ గంగప్ప, టీడీపీ కౌన్సిలర్లు రమేష్‌కుమార్, చంద్రకళ, సతీష్‌కుమార్, అయూబ్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు శివకుమార్, గౌరవాధ్యక్షుడు రామకృష్ణ ట్రోఫీలను ప్రదానం చేశారు.

రహదారులు
రక్తసిక్తం..

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

నలుగురికి గాయాలు

మృతుల్లో చిన్నారి

హిందూపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్లు రక్తమోడాయి. ఆదివారం వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మరణించగా.. నలుగురు గాయపడ్డారు. శుభకార్యం కోసం ఆర్మీలో పనిచేస్తున్న ఉద్యోగి సొంతూరికి వచ్చాడు. మొదటి రోజు శుభకార్యం ముగించుకుని రెండో రోజు కార్యక్రమానికి సంబంధించి సరుకులు తేవడానికి హిందూపురం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో టైరు పంక్చరై ఇంటిని ఢీకొని ఇద్దరు మృతిచెందారు. మరొకరు తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో రెండు రోజులపాటు ఇంటిల్లిపాదీ సంతోషంగా ఉండాల్సిందిపోయి విషాదంలో మునిగిపోయారు. వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు తెలిపిన వివరాల మేరకు.. పరిగి మండలం కాలువపల్లికి చెందిన ప్రవీణ్‌కుమార్ ఆర్మీలో సిగ్నల్ విభాగంలో పనిచేస్తున్నారు. శనివారం నామకరణం కార్యక్రమానికి బంధువులంతా కాలువపల్లికి చేరుకున్నారు. రాత్రి 10గంటలు దాటాక ప్రవీణ్ వరుసకు అన్న అయిన బొజ్జప్పతో కలిసి హిందూపురం బోయపేటకు చెందిన యువకుడు నరహరి కారులో హిందూపురానికి వచ్చి సరుకులు తీసుకున్నారు. పని ముగించుకుని అర్ధరాత్రి కాలువపల్లికి వెళ్తున్నారు. మోతుకపల్లి వద్దకు వెళ్లేసరికి కారు పంచర్ అయి నాగులకట్ట, చెట్టును ఢీకొని అనంతరం రోడ్డుపక్కన ఉన్న ఇంటిని ఢీకొంది. ఈ ఘటనలో బొజ్జప్ప (44), నరహరి (26) అక్కడికక్కడే మృతిచెందారు. కొద్దిసేపటి తరువాత స్థానికులు గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. వారు కాలువపల్లి నుంచి వచ్చి నరహరి, బొజ్జప్ప, ప్రవీణ్‌కుమార్‌ను హిందూపురం ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు నరహరి, బుజ్జప్ప మృతిచెందినట్లు నిర్ధారించారు. ప్రవీణ్‌కుమార్‌కు తీవ్రగాయాలు కాగా అతన్ని వెంటనే ప్రథమ చికిత్స అనంతరం బెంగళూరు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఆర్మీ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. మృతి చెందిన బొజ్జప్పకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రవీణ్‌కుమార్ కుమారుడి శుభకార్యానికి సెలవు పెట్టి వచ్చారు. ఇక్కడికి వచ్చి మొదటి రోజు శుభకార్యాన్ని రెండోరోజుకూడా ఎంతో సంతోషంగా గడపాలనుకున్నారు. కానీ అనుకోని సంఘటనతో ఇంటిల్లిపాది వచ్చిన బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



నరహరి (ఫైల్)



బొజ్జప్ప (ఫైల్)

వేగం తెచ్చిన తంటా..

కారు వేగంగా వెళుతూ అదుపుతప్పి ఢీకొన్నట్లు తెలుస్తోంది. కాలువపల్లి నుంచి హిందూపురం వెళ్లే సమయంలో ఆ కారు వేగంగా వెళ్లినట్లు మోతుకపల్లి వాసులు తెలిపారు. తిరుగు ప్రయాణంలో కూడా అదేవేగంగా వచ్చి అదుపుతప్పి ఢీకొని ఉంటుందని అనుమానిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కారు పంచర్ అయినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎప్పటిలాగా పడుకుని ఉండుంటే..

మోతుకపల్లిలో కారు ఢీకొన్న ఇల్లు వంటగది పాక్షికంగా దెబ్బతింది. ఆ ఇంటిలో ముగ్గురు నివసిస్తున్నారు. వారిలో ఇద్దరు పెళ్లి కోసం వేరే ఊరికి వెళ్లారు. మరొకరు వేరేగదిలో పడుకున్నారు. వారు ఎప్పుడూ ప్రమాదం జరిగిన గదిలోనే పడుకునేవారు. అదృష్టవశాత్తు పక్కగదిలో ఉండటంతో తప్పించుకున్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. చిన్నారి మృతి



జోయాను ఎక్స్‌రేకు తీసుకెళ్తున్న బంధువులు

హిందూపురం అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో చిన్నారి మృతి చెందిన సంఘటన హిందూపురం మండలం మణే సముద్రం ఏ1 స్టీల్ ఫ్యాక్టరీ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. సోమందేపల్లిలోని నక్కలగుట్ట ప్రాంతానికి చెందిన బేల్దారి పని చేసే బాబావలి పిల్లలకు జ్వరం వస్తుండడంతో భార్య మెహర్‌తాజ్, పెద్ద కుమార్తె అఫ్రష్ అలియా (7), చిన్న కుమార్తె జోయాతో కలిసి హిందూపురానికి ద్విచక్రవాహనంలో వస్తున్నారు. మణేసముద్రం ఏ1 స్టీల్ ఫ్యాక్టరీ వద్దకు రాగానే ఎదురుగా మరో ద్విచక్రవాహనంలో వస్తున్న ఒంగోలుకు చెందిన యోనా, అతడి స్నేహితుడు వేగంగా వెళ్లి ఢీకొన్నారు. ఈ ఘటనలో అలియా అక్కడికక్కడే మృతి చెందగా బాబావలికి తీవ్ర గాయాలయ్యాయి. మరో చిన్నారి జోయాకు ఎడమ కాలు విరిగింది. ప్రైవేట్ అంబులెన్స్‌లో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుడు చరణ్ పరిశీలించి అలియా అప్పటికే మృతి చెందిందని, బాబావలిని మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని తెలిపారు. బంధువులు ఆసుపత్రికి చేరుకొని చిన్నారి మృతదేహం వద్ద విలపించిన తీరు అందరినీ కలిచివేసింది.

అందుబాటులోకి రాని 108..

ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఎంత సేపటికి 108 అందుబాటులోకి రాలేదని బాధితులు తెలిపారు. దీంతో ప్రైవేట్ అంబులెన్స్‌లో మృతదేహం, గాయపడిన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ తరువాత మెరుగైన వైద్యం కోసం అనంతపురం వెళ్లాలన్నా గంటల తరబడి 108 వాహనం అందుబాటులోకి రాలేదని వైద్యులు పేర్కొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

మరొకరికి తీవ్రగాయాలు..

పరిస్థితి విషమం



సురేంద్ర (ఫైల్)

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్ఎస్ గేటు సమీపంలో రామగిరికి వెళ్లే రోడ్డుపై ఆదివారం ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు... రామగిరి మండలం కుంటిమద్ది గ్రామానికి చెందిన సురేంద్ర (49) తన బావమరిది రామాంజనేయులుతో కలిసి ఎన్ఎస్ గేటు నుంచి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వెళ్తున్నారు. మండల సరిహద్దులోకి వెళ్లగానే ఎదురుగా వచ్చిన ఓ కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. సురేంద్ర, రామాంజనేయులు తీవ్రంగా గాయపడటంతో అనంతపురం తరలిస్తుండగా సురేంద్ర మృతి చెందాడు. రామాంజనేయులు పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు తరలించినట్టు తెలిసింది.

దుస్తుల వ్యాపారి..

నల్లమాడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులగంపల్లి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుస్తుల వ్యాపారి మృతి చెందాడు. ఎస్ఐ దాదాపీర్ తెలిపిన వివరాల మేరకు.. కదిరి పట్టణంలోని మశానంపేటకు చెందిన ఖాజాపీర్ (48) ద్విచక్రవాహనంపైన బట్టల వ్యాపారం చేసుకునేవాడు. ఆదివారం నల్లమాడ మండలానికి వచ్చి తిరుగు ప్రయాణంలో కదిరికి వెళ్తుండగా ద్విచక్రవాహనం ప్రమాదవశాత్తు జారడంతో కిందపడ్డాడు. ప్రమాదంలో ఖాజాపీర్ తీవ్రంగా గాయపడ్డాడు. అదే సమయంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ బెంగళూరు నుంచి కదిరికి వస్తుండగా.. సంఘటనను చూసి వాహనాన్ని నిలిపారు. వెంటనే గాయపడిన ఖాజాపీర్‌ను ఆటోలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యే వైద్యులతో ఫోన్‌లో సంప్రదించి వైద్యం చేయాలని సూచించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు చెప్పారు. మృతుడికి భార్య ఆఫ్రీన్, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



ప్రమాదస్థలం నుంచి వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

పొదుపు సొమ్ము

రూ. 72 లక్షలు స్వాహా

వెలుగు, బ్యాంకు అధికారుల కుమ్మక్కు

న్యాయం చేయాలని ఎమ్మెల్యేని కోరిన మహిళా సంఘాలు



వెలుగు అక్రమాలపై ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు

కళ్యాణదుర్గం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లికార్జునపల్లిలో మహిళా సంఘాల సభ్యుల పొదుపు సొమ్ము రూ. 72 లక్షలను వెలుగు, బ్యాంకు అధికారులు కుమ్మకై కాజేశారని సంఘాల సభ్యులు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు విన్నవించారు. ఆదివారం ఎమ్మెల్యే ఓ శుభకార్యానికి వెళ్లి వస్తుండగా.. దారి మధ్యలో మల్లికార్జునపల్లికి చెందిన మహిళా సంఘాల సభ్యులు వెలుగులో జరిగిన అవినీతి, అక్రమాలపై ఆయనకు విన్నవించారు. కూలి పనులు చేసుకుని పొదుపు చేసుకున్న డబ్బును సుమారు రూ.72 లక్షల దాకా వెలుగు, బ్యాంకు అధికారులు కుమ్మకై కాజేశారని వాపోయారు. గత ఏడాది నుంచి మహిళా సంఘాల సభ్యులందరూ పోరాటం చేస్తున్నా ఏ ఒక్కరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని, వెలుగు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసినా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని వారు మొరపెట్టుకున్నారు. తమకు న్యాయం చేయాలని, తమ డబ్బును రికవరీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మీరు అధైర్యపడవద్దని, మీ సొమ్మును రికవరీ చేసే బాధ్యత తను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు.

జిల్లా క్రికెట్ సంఘం

తాత్కాలిక కార్యదర్శిగా భీమలింగారెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం తాత్కాలిక కార్యదర్శిగా భీమలింగారెడ్డిని ఎన్నుకున్నారు. ఇది వరకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శిగా ఉన్న మధు ఆచారి వివిధ ఆరోపణలు, క్రీడాకారులు, తల్లిదండ్రుల ఫిర్యాదులతో పదవికి రాజీనామా చేసి తప్పుకున్నారు. దీంతో కార్యదర్శి పదవి ఖాళీ అయింది. ఈ క్రమంలో చాలా మందికి కార్యదర్శి పదవిపై కన్నుపడింది. ప్రధానంగా బీసీసీఐ, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌ల నుంచి జిల్లా క్రికెట్ సంఘానికి నిధులు పుష్కలంగా ఇస్తుండడం, ఇక్కడే జాతీయ స్థాయి మ్యాచ్‌లు నిర్వహిస్తుండడంతో కార్యదర్శి పదవికి పోటీ తీవ్రమైంది. గతంలో జిల్లా క్రికెట్ సంఘంలో పనిచేసి అనేక అవినీతి, ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తులు సైతం తిరిగి ఆ పదవి కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రస్తుతం ఉన్న జిల్లా క్రికెట్ సంఘానికి ఏడాది పాటు గడువు ఉంది. సంఘాన్ని ప్రక్షాళన చేస్తారా... తాత్కాలికంగా నడిపిస్తారా అనేది నూతనంగా ఎన్నికైన ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌పై బాధ్యత ఉంది. ముఖ్యంగా జిల్లాలో వైసీపీ ప్రభుత్వ హయాంలో అనంతపురం మండలం, నియోజకవర్గాల కమిటీల్లో ఒకే సామాజిక వర్గానికి చెందిన వారికి అవకాశం ఇవ్వడంతో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సెలెక్షన్ కమిటీల్లోనూ ఇదే తంతు కొనసాగుతోంది. వీటన్నింటినీ ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ క్రమంలో తాత్కాలికంగా జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శిగా సహాయ కార్యదర్శిగా ఉన్న భీమలింగారెడ్డికి బాధ్యతలు అప్పజెప్పారు. త్వరలో పూర్తి స్థాయి కార్యదర్శిని నియమిస్తారా లేక పూర్తి కమిటీని నియమిస్తారా అనేది స్పష్టత రావాల్సి ఉంది.

గల్లంతైన వ్యక్తి మృతి

కణేకల్లు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెణికల్లు గ్రామానికి చెందిన వన్నప్ప(48) అనే వ్యక్తి శనివారం వేదావతి హగరిలో గల్లంతు కాగా ఆదివారం మధ్యాహ్నం హగరిలో శవమై తేలాడు. వన్నప్ప బిదురకుంతానికి చెందిన సర్పంచ్ హనుమంతప్ప పొలంలో పప్పుశనగ సాగు చేసేందుకు పనికి వస్తున్నట్లు శనివారం ఉదయం ఫోన్ చేసి తెలిపాడు. ఇందు కోసం వన్నప్ప రెండు గ్రామాల మధ్య ఉన్న వేదావతి హగరిని దాటే సమయంలో గల్లంతయ్యాడు. రాత్రి వరకు విషయం ఎవరికి తెలియకపోవడంతో అతడి కోసం బంధువులు వెతకసాగారు. పోలీసులకు కూడా సమాచారం అందించారు. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు ఆదివారం గాలింపు చర్యలు చేపట్టగా మధ్యాహ్నం 12 గంటల సమయంలో హగరిలో వన్నప్ప శవం తేలింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య లింగమ్మతో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. సంఘటన స్థలాన్ని రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ నాగమధు పరిశీలించారు.

ఆరేళ్ల బాలికపై వృద్ధుడి అత్యాచారయత్నం

- పోలీసుల అదుపులో నిందితుడు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల బాలికపై 70 ఏళ్ల వయస్సు ఉన్న ఓ వృద్ధుడు అత్యాచారానికి యత్నించిన సంఘటన మండలంలోని ఓ గ్రామంలో ఆదివారం జరిగింది. బాలిక మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆడుకుంటుండగా వృద్ధుడు మాయ మాటలు చెప్పి తన ఇంటిలోకి తీసుకెళ్లాడు. ఓ గదిలో బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం మొదలు పెట్టాడు. పసిగట్టిన బాలిక ప్రతిఘటించే ప్రయత్నం చేయగా, చంపుతానని బెదిరించాడు. చివరికి ఎలాగోలా అతడి నుంచి తప్పించుకుని ఇంటికి చేరుకున్న బాలిక జరిగిన విషయాన్ని ఏడ్చుకుంటూ తల్లికి తెలిపింది. వెంటనే తల్లి వెళ్లి వృద్ధుడిని నిలదీయగా అతడు బుకాయించాడు. దీంతో ఆమె జరిగిన విషయాన్ని ఫోన్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు గ్రామానికి వెళ్లి వృద్ధుడిని అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌ను తరలించి విచారిస్తున్నట్టు తెలిసింది. దీనిపై ఎస్ఐ సత్యనారాయణను వివరణను కోరగా తమకు సమాచారం రాగానే వృద్ధుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. కాగా కొందరు పెద్ద మనుషులు కేసు నమోదు కాకుండా రాజీ చేస్తున్నట్లు తెలిసింది.

న్యూస్ బాక్స్..

రాష్ట్రస్థాయి చెకుముకి పరీక్షకు ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన సిద్దరాంపురం, ఓడీసీ విద్యార్థులు

కదిరి/ఓబుళదేవరచెరువు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కదిరిలోని సాధన పాఠశాలలో జిల్లాస్థాయి చెకుముకి పరీక్షలు ఆదివారం నిర్వహించారు. అనంతరం రాష్ట్రస్థాయి పరీక్షకు విద్యార్థులను ఎంపిక చేశారు. వారిలో బుక్కపట్నం మండలం సిద్దరాంపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు వీ లోకేష్ కుమార్‌రెడ్డి (10వ తరగతి), చాంద్‌ప్రియ (9వ తరగతి), చిన్న శివయ్య (8వ తరగతి), అలాగే ఓబుళదేవరచెరువులోని రెయిన్‌బో పాఠశాల విద్యార్థులు జి. లయశ్రీ (10వ తరగతి), జి. యశ్వంత్ కుమార్‌నాయుడు (9వ తరగతి), జి. హర్షవర్ధన్‌రెడ్డి (8వ తరగతి) ఉన్నారు. వీరికి మెమెంటోలు, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. ఆదిశేష, జిల్లా అధ్యక్షులు మహేంద్రరెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో సోదాలు

ధర్మవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓబుళనాయనపల్లి, ఓబుళనాయనపల్లితండాలో ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఊరిబయట ముళ్లపొదల్లో సారాకు ఉపయోగించే 50 లీటర్ల ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. పాత నేరస్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇందులో రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.45 వేలు విరాళం

ధర్మవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక షిర్డీసాయి బాబా దేవాలయంలో నిత్యాన్నదా నానికి పట్టణానికి చెందిన కొమ్మిశెట్టి కృష్ణమూర్తి, అరుణాదేవి, కుమార్తె బిందుప్రియ రూ.45 వేలను విరాళంగా అందజేశారు. దీంతో వారిని ఆలయ కమిటీ సభ్యుడు బంధనాధం సూర్యప్రకాశ్ ఆదివారం సన్మానించారు.



దాతలను సన్మానిస్తున్న సభ్యుడు

నేడు విద్యుత్ సరఫరా బంద్

ధర్మవరం, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగిచెర్ల విద్యుత్ ఉపకేంద్ర పరిధిలోని గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ జానకి రామయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ ఉపకేంద్రంలో నిర్వహణ పనులు నిమిత్తం సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదని, ప్రజలు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ధర్మవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలుకుంట్ల గ్రామ సర్పంచ్ గంగమ్మ కుమారుడు దామోదర్ రెండు రోజుల క్రితం ట్రాక్టర్ బోల్తాపడి మరణించిన విషయం తెల్సిందే. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి బాధిత కుటుంబసభ్యులను ఆదివారం పరామర్శించారు. రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు.

భూరీసర్వే గ్రామసభ

గాండ్లపెంట, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మలబైలులో భూ రీసర్వే గ్రామసభను తహసీల్దార్ బాబురావు ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్ఓ జయరాములు, సీనియర్ అసిస్టెంటు జాఫర్‌వలీ, సర్వేయర్, రైతులు పాల్గొన్నారు.

విజేత కదిరి జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎస్కే యూనివర్శిటీ అంతర్ కళాశాల ఏ గ్రూపు క్రీడాపోటీలు రెండు రోజులుగా స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నారు. ఆదివారం నిర్వహించిన టేబుల్ టెన్నిస్ పోటీల్లో కదిరి ఎస్‌టీఎస్ఎన్ కాలేజీ జట్టు విజేతగా నిలిచింది. అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ రన్నరప్‌గా నిలిచింది. విజేతలకు బహుమతులు అందజేశారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా గంగులయ్య



గంగులయ్య

తనకల్లు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా గంగులయ్యను కలెక్టర్ చేతన్ ఎంపిక చేశారు. మండలంలోని మార్పురి వాండ్లపల్లికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు గంగులయ్యను ఎస్టీవో తరఫున నియమించారు. సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ అధికారి.. నియామక పత్రం అందించారు.

● నల్లమాడ జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలో మండలవాసికి స్థానం దక్కింది. మండలంలోని ఎర్రవంకపల్లికి చెందిన న్యాయవాది వీరనారాయణను కమిటీ సభ్యుడిగా కలెక్టర్ నియమించారు.

నేడు రక్తదానశిబిరం

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ రత్నా ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో విద్యార్థులు, యువకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

యథేచ్ఛగా కలప రవాణా

గాండ్లపెంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో కలప రవాణా యథేచ్ఛగా సాగుతోంది. పట్టపగలే.. లారీల్లో అక్రమంగా కలప తరలిస్తున్నా... రెవెన్యూ, అటవీ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో వ్యాపారులు కలప అక్రమ రవాణాను రోజురోజుకూ విస్తరిస్తున్నారు.



గాండ్లపెంట మీదుగా తరలిస్తున్న కలప

చెరువును పరిశీలించిన మంత్రి

పరిగి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా జయమంగళి నది నుంచి వస్తున్న వరద నీటిని పరిగి చెరువుకు మళ్లించడంతో చెరువు నిండు కుండలా దర్శనమిస్తోంది. బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఆదివారం పరిగి చెరువు చెరువుకట్టను పరిశీలించారు. నీరు వృథా కాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు.



చెరువును పరిశీలిస్తున్న మంత్రి సవిత

కల్తీ కానరాదా..?



సంపాదనే లక్ష్యంగా వ్యాపారులు తక్కువ ధరకు లభించే కల్తీ, నాసిరకం వాటితో ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారు. వాటిని తిని ప్రజలు అనతి కాలంలోనే రోగాల బారిన పడుతున్నారు. ప్రముఖ హోటళ్ల నుంచి.. రోడ్డు సైడ్ డాబాలు.. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వరకూ ఆహార భద్రత ప్రమాణాలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఆ ఆహార పదార్థాలను తనిఖీ చేసి.. ఆ వ్యాపారులపై చర్యలు తీసుకోవాల్సి ఆహారభద్రత సంస్థ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు పలు వ్యాధులకు గురై.. ఆస్పత్రుల పాలవుతున్నా.. పట్టించుకునే నాథుడే లేడు.

- గాలిలో ఆహారభద్రత...
- ఇబ్బడిముబ్బడిగా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు
- నాణ్యతకు తిలోదకాలు
- రోగాల బారిన ప్రజలు
- నిద్రావస్థలో అధికారులు

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వీధికో ఫాస్ట్‌ఫుడ్, కబాబ్ సెంటర్లను వ్యాపారులు ఏర్పాటు చేశారు. వాటిలో ఆహార పదార్థాల తయారీలో ప్రమాణాలను ఏ మాత్రం పాటించ కుండా.. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం రెస్టారెంట్లు 200, బేకరీలు 300, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు 500, కబాబ్ సెంటర్లు 1000 పైగా ఉన్నాయి. వీటిల్లో ప్రజలకు సురక్షిత, నాణ్యత, ఆరోగ్య ప్రమాణాలు కలిగిన ఆహారం అందుతోందా.. లేదా.. అని తనిఖీలు నిర్వహిస్తుండటం జిల్లా ఆహారభద్రత సంస్థ అధికారుల ప్రథమ లక్ష్యం. అయితే సిబ్బంది కొరత పేరుతో ఉన్న అధికారులు ఏదో నామ మాత్రంగా తనిఖీలు నిర్వహిస్తూ.. చేతులు దులిపేసుకొంటున్నారు.

అంతేకాకుండా కల్తీ వ్యాపారుల నుంచి ఈ అధికారులకు నెలనెలా మామూళ్లు అందుతుండటం తోనే వీరు తనిఖీ నిర్వహించడం లేదనే ఆరోపణలూ ఉన్నాయి. దీంతో జిల్లాలో హోటళ్లు, రెస్టారెంట్లు మొదలు కొని.. వీధిలో బండ్లపై నిర్వహించే ఫాస్ట్‌ఫుడ్, కబాబ్ సెంటర్ల నిర్వాహకుల వరకూ ఆహార భద్రతా ప్రమాణాలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. కల్తీ, నాణ్యత లేని వాటితో ఆహార పదార్థాలను తయారు చేసి.. ప్రజా ఆరోగ్యంతో చెలగాటమాడుతూ.. వారి జేబులు నింపుకుంటున్నా... పట్టించుకునే వారే కరువయ్యారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఇది మా పరిధిలోనిది కాదు అంటూ.. ఒకరిపై ఒకరు నెపాలు వేసుకుంటూ కాలయాపన చేస్తున్నారు. పైగా ఈ అక్రమ వ్యాపారుల నుంచి నెలనెలా మామూళ్లను సైతం ముక్కుపిండి మరీ వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం.



నాణ్యత ప్రమాణాలు నిల్

పలు హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్, కబాబ్ సెంటర్లలో నాణ్యత ప్రమాణాలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఒకసారి కాచిన నూనె మళ్లీ ఉపయోగించడం చాలా ప్రమాదం. అలా చేయడం నేరం. అయితే ఎక్కడా కూడా ఇది అమలు కావడం లేదు. వారాల తరబడి వాడిన నూనెనే వాడుతున్నారు. దీంతో అనారోగ్యహేతువైన టీపీసీ స్థాయి నూనెలో 65 శాతం పైబడుతోంది. సాధారణంగా నూనెలో టీపీసీ శాతం 25కు మించకూడదు. కాని ఈ చర్యలను ఎవరూ కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. ఎక్కువ టీపీసీ ఉన్న నూనెలను ఉపయోగించి తయారుచేసే ఆహారపదార్థాలతో కేన్సర్ తదితర భయంకర రోగాలు వస్తాయి. అంతేకాకుండా స్వీట్ స్టాళ్లలో కలుపుతున్న రంగులు కారణంగా తయారుచేసే పదార్థాలు పదిరోజులైనా తాజాగా కనిపిస్తాయి. వీటిని తయారీలో సైతం నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. ప్రస్తుత ప్రజలు బీపీ, షుగర్ వాధ్యుల బారిన పడటానికి ఇదీ ఒక కారణం అవుతోంది.

వసతి గృహాలపై శీతకన్ను...

జిల్లా వ్యాప్తంగా దాదాపు 83 ప్రభుత్వ వసతి గృహాలున్నాయి. ఇందులో ఎస్సీ వసతి గృహాలు, ప్రిమెట్రిక్ పోస్టు మెట్రిక్ వసతి గృహాలు 26, బీసీ వసతి గృహాలు, ప్రిమెట్రిక్ పోస్టు మెట్రిక్ వసతి గృహాలు 57 ఉన్నాయి. రెండేళ్ల కాలంలో జిల్లా ఆహార భద్రతాధికారులు వీటిల్లో ఏదో వచ్చామా.. చూసామా.. వెళ్లామా.. అనేరీతిలో తనిఖీలు నిర్వహించి.. చేతులు దులిపేసుకున్నారు. ఇక ప్రైవేట్ విద్యా సంస్థల్లోని హాస్టళ్లల్లో ఆహార నాణ్యత ప్రమాణాల గురించి పట్టించుకునే నాథుకే కరువయ్యాడు.

విధుల్లో నిర్లక్ష్యం..

జిల్లా కేంద్రంలో ఆహార భద్రత అధికారి కార్యాలయం ఎప్పుడు తెరుస్తారో.. ఎప్పుడు మూస్తారో.. తెలీదు. కనీసం మూమెంట్ రిజిష్టర్ నిర్వహణ కూడా లేదు.

సిబ్బంది కొరత

జిల్లాలో జీఎఫ్ఎస్ఓలు ఇద్దరు ఉండాల్సి ఉండగా ఒకరే ఉన్నారు. జీఎఫ్‌సీ ఒకరు ఉండాల్సి ఉండగా ఖాళీగా ఉంది. ఉన్న ఇద్దరు జిల్లా స్థాయి అధికారుల్లో ఒకరు దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. దీంతో తనిఖీలు చేపట్టలేకపోతున్నామని ఆ అధికారులు అంటున్నారు.

తనిఖీలు నిర్వహిస్తున్నాం

జిల్లా ఏర్పడి రెండేళ్లు అవుతోంది. ఇప్పటికి 250 తనిఖీలు నిర్వహించాం. వాటిల్లో 28 మందిపై కేసులు నమోదు చేశాం. వీటిలో జాయింట్ కలెక్టర్ 20 కేసులను పరిష్కరించారు. ఆ 20 మంది నుంచి రూ. 68 వేల అపరాధ రుసుం వసూలు చేశాం. ఇంకా ఎనిమిది కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. భద్రతా ప్రమాణాలు పాటించని ఫుడ్ సెంటర్లను సీజ్ చేసే అధికారం మాకు లేదు. వాటిని సీజ్ చేసే అధికారం స్థానిక మున్సిపల్ కమిషనర్లకే ఉంటుంది.

-రామచంద్ర,
జిల్లా ఆహారభద్రతాధికారి

కట్టారు.. వదిలేశారు..!

కొత్తచెరువులో నిరుపయోగంగా అగ్రిటెస్టింగ్ ల్యాబ్

రూ. 60 లక్షల ప్రజాధనం వృథా

కొత్తచెరువు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి నియోజకవర్గంలో డాక్టర్ వైఎస్ఆర్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను రూ. లక్షలు వెచ్చించి నిర్మించారు. భూసారా పరీక్షలు, పశువులకు సోకే జబ్బులు.. తదితర వాటిపై పరీక్షల నిమిత్తం వీటిని ఏర్పాటు చేశారు. అందులో భాగంగా కొత్తచెరువులో దాదాపు రూ. 40 లక్షలతో నిర్మించిన ఈ భవనాన్ని 2022 నవంబరులో ప్రారంభించారు. దాదాపు రూ. 20 లక్షల పరికరాలనూ తెప్పించారు. అయితే పరికరాలకు సంబంధించిన ఫర్నీచర్ రాలేదు. దాని గురించి నాటి పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో అది నేటికీ నిరుపయోగంగా ఉంది. ప్రజాదనం వృథా అయింది. కూటమి ప్రభుత్వం స్పందించి ఈ ల్యాబ్‌లను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న వైఎస్ఆర్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్



బస్సు కోసం గాండ్లపెంటలో వేచి ఉన్న విద్యార్థులు, ప్రయాణీకులు

వేళకు రాని బస్సులు

గాండ్లపెంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కొద్ది నెలలుగా ఆర్టీసీ బస్సులు సమయ పాలన పాటించకపోవడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గంటల కొద్ది వేచి చూస్తున్నారు. సకాలంలో విద్యాసంస్థలకు చేరుకోలేక విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. గంటలపాటు ఒక్క బస్సూ రాకపోవడం... ఒకేసారి నాలుగైదు బస్సులు వస్తుండటంపై ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆర్ఎస్ఎస్ పదసంచలనం

ధర్మవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ ఏర్పడి వంద సంవత్సరాలు అవుతున్న నేపథ్యంలో ఆదివారం స్థానిక ఆర్ఎస్ఎస్ నాయకులు, కార్యకర్తలు పదసంచలనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ర్యాలీ పట్టణంలోని కళాజ్యోతి, పీఆర్‌టీ, గాంధీసర్కిల్, అంజుమన్‌సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ మీదుగా తిరిగి కళాజ్యోతి సర్కిల్‌కు చేరుకుంది. ర్యాలీలో ఆర్ఎస్ఎస్ ఘోస్‌గీతంతో ముందుకు సాగారు. కార్యక్రమంలో ప్రాంత బౌద్ధిక్ ప్రముక్ కొండపల్లి రామారావు, ఆర్మీ విశ్రాంత ఉద్యోగి శ్రీధర్, వంద లాది మంది ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

● ముదిగుబ్బ: మండల కేంద్రంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి 100 సంవత్సరాల్లో అడుగుపెడుతున్న సందర్భంగా స్థానిక ఎంపీపీ ఆదినారాయణయాదవ్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ బస్టాండ్ కూడలి నుంచి దొరిగిల్లు రోడ్డు, కదిరి, అనంతపురం ప్రధాన రహదారులు మీదుగా సాగింది. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు సోమలప్రకాశ్, వెంకటేశ్, కుళ్లాయప్ప, అంబటి ప్రకాశ్, పణి, ఓబిరెడ్డి, రాజా, ప్రసాద్ పాల్గొన్నారు.



ధర్మవరం, ముదిగుబ్బలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

ఇంకా జగన్ జపమేనా..!

- నేటికీ స్వామిభక్తిలో తరిస్తున్న కొందరు అధికారులు
- ప్రభుత్వ కార్యాలయాల్లో దర్శనమిస్తున్న జగనన్న బొమ్మలు
- కళ్లుండి చూడలేకపోతున్న కూటమి నేతలు





తలమర్లలో రైతుభరోసా కేంద్ర భవనంపై వైఎస్ఆర్ పేరున్న దృశ్యం



ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న జగన్ స్టిక్కర్

ధర్మవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు మాసాలు అవుతున్నా... నేటికీ కొందరు అధికారులు వైసీపీ భక్తిలో తరిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఫొటోలను ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వం అధికారులను ఆదేశించినా.. ఈ అధికారుల చెవిలోకి ఎక్కడం లేదు. జిల్లాలోని కొన్ని మండలాల్లోని సచివాలయాలు, విలేజ్ హెల్త్‌క్లినిక్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాల్లో నేటికీ మాజీ సీఎం ఫొటోలే దర్శనమిస్తున్నాయి. మాజీ సీఎం జగన్ ఫొటోలు, నవరత్నాల ప్రచార బోర్డులు, వైఎస్ఆర్ పేరుతో ఉన్న బోర్డులను అలాగే ఉంచారు. అంతేకాకుండా కొంతమంది ఉద్యోగులు నేటికీ వైసీపీ నేతలకు తొత్తులుగా వ్యవహరించి.. వారు చెప్పిందే చట్టమన్న విధంగా విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ పంచన చేరుతూ ఆ పార్టీ కండువాలను మార్చుకొని ఊసరవెల్లి రాజకీయాలు చేసే నేతల హవా నడుస్తోంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఇదే పరిస్థితి. అందువల్లే పలు కార్యాలయాల్లో సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఫొటోలు పెట్టకపోయిన వారిలో ఎలాంటి చలనమూ ఉండదని కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయాల్లో సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలను ఇంకా ఏర్పాటు చేయకపోవడం వారిని అవమానించినట్లు కాదా .. నాయకులు సైతం కళ్లుండి చూడలేని కబోదుల్లా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు.

క్రైం కార్నర్ ..

పేకాటరాయుళ్ల అరెస్ట్

కదిరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తలుపుల మండలం భూపతి వాండ్లపల్లి అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1,62,100 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి.. కోర్టుకు హాజరు పరిచామని అన్నారు.

ఆస్తులు కాజేసి.. బెదిరిస్తున్నారని ఫిర్యాదు

కదిరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తన తాత ఆస్తులు కాజేయడమే కాకుండా.. తనను చంపుతామని బెదిరిస్తున్నారని స్థానిక రైల్వేస్టేషన్‌లో నివాసముంటున్న షేక్ ఇమ్రాన్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడు. పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపిన సమాచారం మేరకు.. షేక్ ఇమ్రాన్ తాత మాబూసాబ్‌కు నల్లచెరువులో వివిధ సర్వే నెంబర్లతో నాలుగు ఎకరాల నాలుగు సెంట్లు స్థలముంది. ఉమ్మడి ఆస్తి అయిన ఆ భూమిని షేక్ ఇమ్రాన్ చినాన్న షేక్ ముస్తఫా ఇమ్రాన్ తండ్రి ఖదర్‌బాషాను మోసం చేసి ఆ ఆస్తి కాజేశాడు. అంతే కాకుండా పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న రెండున్నర సెంట్లు స్థలంలో ముస్తఫా ఇమ్రాన్ కుటుంబసభ్యులకు తెలియకుండా భవనం నిర్మించి, ఓ ప్రైవేటు ఆసుపత్రికి లీజుకు ఇచ్చాడు. తమ వాటా ఇవ్వాలని ఇమ్రాన్, తన్న చినాన్న ముస్తఫాను అడుగ్గా .. అతనితో పాటు అతని కుమారుడు ఖాజామైనోద్దీన్, ఆయన భార్య తాహేరా బెదిరించారు. ముస్తఫాకు చెందిన పరికి షామీర్‌బాషా, కొలిమి హర్షద్ హత్య చేస్తామని షేక్ ఇమ్రాన్‌ను బెదిరించారు. దీనిపై షేక్ ఇమ్రాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు షేక్ ముస్తఫా, షేక్ ఖాజామైనోద్దీన్, తాహేరా, పరికి షామీర్‌బాషా, కోలిమి హర్షాద్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ధర్మవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు, ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న కంటెంజెంట్ ఆయాలు, శానిటరీ వర్కర్స్‌తో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడా రు. 30 సంవత్సరాలు పైగా పనిచేస్తున్న కార్మికులకు కేవలం రూ.4 వేలు, శానిటేషన్ వర్కర్స్ రూ.6వేలు ఇస్తూ వారితో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుంటోందన్నారు. కావున వారికి కనీస వేతనం ఇవ్వాలన్నారు. అదేవిధంగా అరియర్స్, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. సమస్యలను మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లడానికి కార్మికులందరూ కలిసి రావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మంచిల కో కన్వీనర్ ఎల్ ఆదినారాయణ, పారిశుధ్య కార్మికసంఘం నాయకురాలు చౌడమ్మ, జయమ్మ, ముంతాజ్, నాగవేణి, వరలక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాలల పరిరక్షణకు యూటీఎఫ్ పోరాటం



నూతన కమిటీ సభ్యులతో యూటీఎఫ్ నాయకులు

పెనుకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ ఆధీనంలో విద్యాసంస్థలు ఉంటేనే సమాజంలో నైతిక విలువల ప్రజాతంత్ర హక్కులను నిలబెట్టుకోగలమని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. ఆదివారం పెనుకొండలోయూటీఎఫ్ మండల మహాసభలు జిల్లా కార్యదర్శి నరేష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ యూటీఎఫ్ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ఉపాధ్యాయుల సంక్షేమానికి పోరాటం చేస్తుందన్నారు. 117జీవోను వెంటనే రద్దు చేయాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కృష్ణానాయక్, అధ్యక్షుడిగా ఉపేంద్ర, మూర్తి, ప్రధాన కార్యదర్శిగా రమేష్, ఉపాధ్యక్షుడిగా పెద్దిరాజు నాగమణి కోశాధికారిగా ఆది, ఎన్నికయ్యారు.

ఎలుకల మందు తాగి ఆత్మహత్య

హిందూపురం, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పులిమతి రోడ్డులో నివాసమున్న చాక లిరాము (45)ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు టూటౌన్ సీఐ అబ్దుల్ కరీం తెలిపారు. పులమతి రోడ్డులో నివాసమున్న చాకలి రాము అల్లుడు కొంతకాలం క్రితం మృతిచెందాడు. దీంతో అప్పటి నుంచి కుమార్తె కాపురంపై బెంగపెట్టుకున్నాడు. అంతేకాక కొంతకాలంగా తాగుడుకు అలవాటుపడ్డాడు. ఆదివారం తెల్లవారుజామున శీతల పానీయంలోకి ఎలుకల మందు కలుపుకుని సేవించాడు ఉదయం కుటుంబ సభ్యులు చూసేసరికి మృతిచెందాడు. భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

టీటీసీ పరీక్ష కేంద్రం తనిఖీ

అనంతపురం విద్య, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): టీటీసీ లోయర్ గ్రేడ్ థియరీ పరీక్షల కేంద్రాన్ని డీఈఓ ప్రసాద్ బాబు తనిఖీ చేశారు. ఆదివారం నగరంలోని రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో టీటీసీ పరీక్షలు నిర్వహించారు. ఉదయం 11 నుంచి 1 గంట వరకూ, మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకూ, మధ్యాహ్నం 3.30 నుంచి 5 గంటల వరకూ మూడు సెక్షన్లలో నిర్వహించారు.

జూదరుల అరెస్ట్

సోమందేపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున శివాలయంలో పేకాటాడుతున్న జూదరులను పోలీసులు అరెస్టుచేశారు. తమకు అందిన సమాచారం మేరకు శివాలయంలో జూదమాడుతున్న వారిపై దాడిచేసి పది మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.16,800 నగదు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు నూతన బస్సుల ప్రారంభం

పెనుకొండ టౌన్, అక్టోరు 27 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి ఆధ్వర్యంలో సోమవారం నూతన బస్సు సర్వీసులను ప్రారంభించనున్నట్లు మండల కన్వీనర్ సిద్దయ్య తెలిపారు. సాయంత్రం 4గంటలకు ఆర్టీసీ బస్సు డిపోలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు తరలి రావాలని ఆయన కోరారు.

సత్తాచాటిన గ్లోబుల్‌జెన్ విద్యార్థులు



బహుమతులను అందుకుంటున్న విద్యార్థులు

పెనుకొండ టౌన్, అక్టోరు 27 (ఆంధ్రజ్యోతి): చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో గ్లోబుల్‌జెన్ పాఠశాల విద్యార్థులు సత్తాచాటినట్లు కరస్పాండెంట్ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి సైన్స్‌సంబరాలు, టాలెంట్ టెస్ట్‌లో గ్లోబుల్‌జెన్ విద్యార్థులు మూడోస్థానంలో నిలిచారన్నారు. ప్రతిభచూపిన సారథి, నందిని, మణివిక్రం అనే విద్యార్థులను కరస్పాండెంట్ అభినందించారు.

చార్జీల భారం తగ్గించండి

పెనుకొండ, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఎన్డీఏ ప్రభుత్వం ఇచ్చిన హామీలు మరిచి విద్యుత్ చార్జీలు పెంచడానికి ప్రయత్నిస్తున్న ప్రయత్నాన్ని విరమించుకోవాలని సీఐటీయు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక సీఐటీయు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐటీయు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచేదిలేదని హామీ ఇచ్చిందన్నారు. కానీ ఇచ్చిన మాట తప్పి నేడు 44శాతం చార్జీలు పెంచడానికి ప్రయత్నిస్తుందన్నారు. పెంచిన విద్యుత్ చార్జీ వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం ఎన్డీఏ ప్రభుత్వం ప్రైవేట్ సంస్థల నుండి విద్యుత్‌ను అధిక ధరలకు కొనుగోలు చేసి ప్రజలపై భారం మోపుతూ ప్రైవేట్ సంస్థలకు ప్రభుత్వం దాసోహం చేస్తున్నారన్నారు. చార్జీలు పెంచే ప్రయత్నాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ బాబావలి, ఆటోనాగప్ప, రిజ్వాన్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో బీమా పొందండి

పెనుకొండ, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): స్థానిక హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బీకే పార్థసారథి కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కన్వీనర్ రవిశంకర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమాన్ని రాష్ట్ర అభివృద్ధిని కోరుకునే వారందరూ పార్టీ సభ్యత్వాన్ని రూ.100 చెల్లించి తీసుకోవాలన్నారు. సభ్యత్వం చేయించుకున్నవారికి రూ.5లక్షల వరకు ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు.

భవిష్యత్తుకు బాటలు

అగళి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకుని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని టీడీపీ మండల క్లస్టర్ ఇంచార్జ్ శివకుమార్ పేర్కొన్నారు. అగళి మండలంలోని హళ్లికెర గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. అభిమానులు టీడీపీ సభ్యత్వం తీసుకోవాలని సూచించారు.

పంట నష్టపోయాం

పరిహారం ఏదీ?

- 35 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు...
- 2.27లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు అంచనా
- పరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదిక





దెబ్బతిన్న పత్తిపంటను చూపుతున్న రైతు

మడకశిర,అక్టోబరు, 27, (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు నియోజకవర్గంలో పత్తి, వరితోపాటు వేరుశనగ పంట కూడా దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్ట పోయారు. తీరా పంటలు చేతికి వచ్చే సమయంలో కురిసిన వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మడకశిర ప్రాంతంలో అధిక శాతం మంది రైతులు మెట్ట పంటల సాగు పై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. రైతులు చాలా మంది పత్తి పంట సాగు పై మొగ్గుచూపుతున్నారు. గత యేడు కూడా పత్తి సాగు లో మంచి దిగుబడులు రావడంతో ఈ యేడు మరికొంత మంది రైతులు పత్తి పంట సాగు వైపు మొగ్గు చూపారు. నియోజకవర్గంలో రైతులు వరిని 635 ఎకరాల్లో, పత్తి 7400 ఎకరాల్లో సాగు చేశారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో పత్తి పంటకు నష్టం వాటిల్లింది. పత్తి చెట్లలోని కాయలకే మొలకలు వచ్చాయి. నియోజకవర్గంలోని ఐదు మండలాలలో దెబ్బతిన్న పంటలను అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్ళి పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికను పంపినట్లు సమాచారం. నియోజకవర్గంలో విస్తారంగా కురిసిన వర్షాలకు మడకశిర మండంలో వరి 5ఎకరాల్లో రొళ్లలో పత్తి 30 ఎకరాల్లో దెబ్బతింది.వరి కి రూ.32500లు, పత్తికి 1,95000ల మేర నష్టం వాట్లినట్లు అధికారులు అంచనా వేసినట్లు సమాచారం.. అదేవిధంగా వేరుశనగ పంట కూడా పలు చోట్ల దెబ్బతిని రైతులు నష్ట పోయారు. వారం రోజులు పాటు విస్తారంగా వర్షాలు కురవడంతో వేరుశనగ పంట ను తొలగించిన వాళ్ళు కొంత మంది దానిని పొలాల్లోనే వదిలి షేరు. దీంతో వేరుశనగ తీగ కూడా నల్లగామారిపోయింది. వేరుశనగ కాయల్లో లొట్టలు ఎక్కువగా ఉండడంతో దిగుబడి తగ్గింది. దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

సాగు ఖర్చులు కూడా చేతికి అందడం లేదు

: రంగనాథప్ప, మల్లినమడుగు

రెండు ఎకరాల పొలంలో పత్తి పంట సాగు చేశాం. గత వారం రోజుల పాటు నియోజకవర్గంలో విస్తారంగా వర్షాలు కురవడంతో పత్తి పంట దెబ్బతిని పూర్తి గా నష్ట పోయాం. పెట్టిన ఖర్చులు కూడా చేతికి అంద లేదు. దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

35ఎకరాల్లో దెబ్బతిన్న వరి, పత్తి

- 2.27లక్షలదాకా నష్టం: ఏడీ కృష్ణమీనన్

గతవారం రోజుల పాటు నియోజకరవ్గంలో విస్తారంగా వర్షాలు కురవడంతో 35 ఎకరాల్లో పత్తి, వరి పంటలు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న పంటలను క్షేత్ర స్థాయి లో పరిశీలించి పంట నష్టం అంచనా వేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపాం. ఆదేశాలురాగానే పరిహారం చెల్లిస్తాం.

గోరంట్లలో ఆర్‌ఎస్‌ఎస్ శతవసంత వేడుకలు

గోరంట్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆర్ఎస్ఎస్ శతవసంత వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంఘం వందవ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా స్వయం సేవకులు పట్టణంలో పథసంచలనం చేశారు. మొదటగా మండలకేంద్రంలోని గంపల రామక్రిష్ణారెడ్డి కాంపౌండ్‌లో ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు డాక్టర్‌జీ, గురూజీ, భరతమాత చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ప్రధాన రహదారిపై బస్టాండ్ కూడలి వరకు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పథసంచలనం నిర్వహించారు. చివరగా జరిగిన సభా కార్యక్రమానికి విజయవాడ ఆర్ఎస్ఎస్ ప్రాంత సేవా ప్రముఖ్ కె.కేశవజీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆర్ఎస్ఎస్ ఆశయాల గురించి, శత వసంత ప్రాముఖ్యం, సంఘ లక్ష్యాల గురించి కార్యకర్తలకు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకులు హరినాథ్‌రెడ్డి, శరత్‌కుమార్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, చలపతి, నరసింహప్ప, ప్రిన్సిపల్ కెంపుల లక్ష్మీనారాయణ, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసులు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సీఐ శేఖర్, ఎస్ఐ శ్రీనివాసులు, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



గోరంట్లలో పథ సంచలనం నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ స్వయంసేవకులు

చెరువును పరిశీలించిన మంత్రి సవిత



చెరువులో నీటిని పరిశీలిస్తున్న మంత్రి సవిత

పరిగి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కర్నాటక ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా గత నెల రోజుల నుంచి జయమంగళి నది నుంచి వస్తున్న వరద నీటిని పరిగి చెరువుకు మళ్లించడంతో చెరువు నిండు కుండలా దర్శనమిస్తోంది. చెరువుకట్టకు ఇరిగేషన్ అధికారుల ఆధ్వర్యంలో మరమ్మతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఆదివారం పరిగి చెరువువద్దకు చేరుకుని చెరువుకట్టను పరిశీలించి నీరు వృధాకాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం మరువవద్దకు చేరుకుని చెరువులో నీరు 0.6టీఎంసీలతో కళకళలాడుతోందని, వ్యవసాయం చేసుకునే రైతులకు ఎలాంటి నీటి సమస్య ఉండదంటూ ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గోవిందరెడ్డి, సర్పంచ్ బాలాజీ, మాజీ ఎంపీ సూర్యనారాయణ, లక్ష్మణ్‌రావు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి సవిత

కాలువపల్లి గ్రామానికి చెందిన బొజ్జప్ప(42) హిందూపురం పూలమార్కెట్‌కువెళ్లి వస్తుండగా మోతుకపల్లి గ్రామం వద్ద కారు ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలుసుకున్న మంత్రి సవిత కాలువపల్లిలో మృతుని ఇంటికి వెళ్లి భౌతికకాయానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలంటూ వారికి అండగా తానుంటానని భరోసా ఇచ్చారు.

విద్యుత్‌శాఖలో ఇంటి దొంగలు

లేపాక్షి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది కాసులకోసం స్తంభాలను సైతం అమ్ముకుంటున్నారు. రైతులు పొలాలవద్దకు విద్యుత్ స్తంభాలు కావాలంటే కార్యాలయం చుట్టూ ఏళ్ల తరబడి తిరగాల్సిందే. సిబ్బందికి ముడుపులు ఇస్తేమాత్రం స్తంభాలను సరఫరా చేస్తున్నారు. వాటిని విద్యుత్ సరఫరా కోసమే కాకుండా ఇంటి నిర్మాణాల కోసం కూడా వాడేస్తున్నారు. ఇటీవల ఓ వైసీపీ నాయకుడు తాను నిర్మించిన మల్బరీ షెడ్డుకు ఏకంగా ఈ స్తంభాలనే ఉపయోగించి రేకులను అమర్చాడు. ఇదేంటని ప్రశ్నిస్తే సిబ్బందే తనకు ఇచ్చారని బహిరంగంగా జవాబిస్తున్నాడని రైతులు తెలిపారు. కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి అంత ధైర్యం లేదని ఉన్నతాధికారుల సపోర్ట్‌తోనే స్తంభాలను అమ్ముకుంటున్నారని రైతులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. వైసీపీ నాయకులను అంటకాగిన అధికారులే ఇంకా ఇక్కడ కొనసాగుతుండటం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ బాగోతాన్ని బయట పెట్టాలని రైతులు కోరుతున్నారు.



సబ్‌స్టేషన్‌లో భద్రతలేకుండా పడేసిన విద్యుత్ స్తంభాలు

ఎస్టీ హోదాతోనే వాల్మీకులకు న్యాయం

- వాల్మీకి సంఘం నాయకుల డిమాండ్

హిందూపురం అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఎస్టీ జాబితాలోకి వాల్మీకి కులస్థులను చేర్చినపుడే వారికి న్యాయం జరుగుతుందని కనుక వారిని ఎస్టీల్లో చేర్చాలని సంఘం నాయకులు బీఎన్‌మూర్తి, బేవనహళ్ళి ఆనంద్‌లు డిమాండ్ చేశారు. పట్టణ పరిధిలోని మోతుకపల్లిలో ఆదివారం వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ గత 60 ఏళ్ళకుపైగా తమ కులపెద్దలు ఎస్టీ సాధనకు పోరాటాలు చేస్తూనే ఉన్నారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం కూటమిలో ప్రధాన పాత్ర పోషిస్తున్నందున ఏపి సీఎం చంద్రబాబుకు ఎస్టీ సాధన సాధ్యమౌతుందన్నారు. ఈ సందర్భంగా మహిళలు జ్యోతులను మోశారు. కార్యక్రమంలో మోతుకపల్లి వాల్మీకి సంఘం నాయకులు అంజినప్ప, గోవిందప్ప, వెంకటేశులు, శీన, తిమ్మయ్య, నాగరాజు, వెంకటేష్, రమేష్ తదితరులు ఉన్నారు.



వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్న గుండుమల తిప్పేస్వామి

ఎస్టీజాబితాలో చేర్పించేందుకు కట్టుబడి ఉన్నాం : గుండుమల

అగళి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్పించేందుకు కృతనిశ్చయంతో ఉన్నారని త్వరలోనే వారిని ఎస్టీ జాబితాలో చేర్పిస్తారని రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు.

అగళి మండల ఆలూడి గ్రామంలో ఆదివారం జరిగిన వాల్మీకి జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన వాల్మీకి కులస్థులను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తారన్నారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు నరసింహప్ప, గిరీష్, రాజు, మోహన్, రవి, మాజీ సర్పంచ్ పుట్టనరసప్ప, కన్వీనర్ కుమార్‌స్వామి, జెడ్పీటీసీ ఉమేష్, తిప్పేస్వామి పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

గుడిబండ: మండలంలోని శంకరగల్లు, ఎస్.రాయాపురం గ్రామాల్లో వాల్మీకి సోదరుల ఆధ్వర్యంలో ఘనంగా వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు సతీమణి ఉమాదేవి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తిలు హాజరయ్యారు. వాల్మీకి విగ్రహానికి ప్రత్యేకంగా పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లో మహిళలు హారతులు మోసి మొక్కుబడులు తీర్చుకొన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సోదరులు బాదిపల్లెప్ప, వీఆర్ఓ రామప్ప, లైన్‌మెన్ భోజరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మరో మూడు రోజులు పురంలో నీటి కష్టాలు

హిందూపురం అర్బన్, అక్టోబరు 27: (ఆంధ్రజ్యోతి): హిందూపురానికి మరోసారి నీటి కష్టాలు పునరావృతమవుతున్నాయి. దీంతో మరో మూడు రోజులు నీరు బంద్ కానున్నట్లు మునిసిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు ప్రకటనలో పేర్కొన్నారు. గొల్లపల్లి లిఫ్ట్ ఇరిగేషన్‌లో భాగంగా ఎస్.కె.డి వద్ద విద్యుత్ స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టడానికి మూడు రోజులు సమయం పడుతుందని దీంతో పట్టణానికి నీరు రావడానికి మూడు రోజులు పడుతుందని ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

5న అనంతలో మందకృష్ణ మాదిగ ర్యాలీ

మడకశిరటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నవంబరు 5వతేదీన ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణమాదిగ అనంతపురంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నారని, పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని మడకశిర ఎంఈఎఫ్ అధ్యక్షులు రంగనాథ్ కోరారు. ఆదివారం పట్టణంలో స్థానికంగా ఎంఈఎఫ్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఎన్నో ఏళ్లపాటు ఏబీసీడీ వర్గీకరణ కోసం పోరాటం చేశారని, కోర్టు సైతం సానుకూలంగా స్పందించడంతో విజయోత్సవ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మనోహర్ కుటుంబ సభ్యులకు ఎంపీ పరామర్శ

మడకశిరటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మడకశిర పట్టణ అధ్యక్షులు మనోహర్ అనారోగ్యంతో మూడు రోజుల క్రితం మృతి చెందిన విషయం తెలుసుకొన్న అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ ఆదివారం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. పార్టీ అండగా ఉంటుందని, అధైర్య పడవద్దని వారికి ధైర్యం చెప్పారు.

వర్గీకరణకు మద్దతుగా దళితుల సమావేశం

పావగడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు దేశంలోనే కొన్ని రాష్ట్రాల్లో ఏబీసీడీ వర్గీకరణ జరిగి ఉండి కర్ణాటకలో కూడా ఏబీసీడీ వర్గీకరణ చేయాలంటూ దళితుల ఐక్యత సమావేశాన్ని ఆదివారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించారు. ఇప్పటికే హర్యానా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఏబీసీడీ వర్గీకరణ అమలు చేశారని, అదేవిధంగా కర్ణాటక రాష్ట్రంలో కూడా ఏబీసీడీ వర్గీకరణతో బహుసంఖ్యాకులైన దళితులకు అన్ని రంగాల్లో ప్రవేశం కల్పించేందుకు అవకాశం ఉంటుందని దళిత నాయకుడు సుబ్బరాజు తెలియజేశారు. సోమవారంక్యాబినెట్‌లో జరిగే వర్గీకరణ విషయంపై పరిస్థితిని చూసి పోరాటం చేద్దామన్నారు.

దేశం కోసం ఆర్‌ఎస్‌ఎస్ ర్యాలీ



రూట్‌మార్చ్ నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ స్వయంసేవకులు

హిందూపురం అర్బన్, అక్టోబరు 27:(ఆంధ్రజ్యోతి): దేశం కోసం ధర్మం కోసం ఆర్ఎస్ఎస్ ఎప్పుడు ముందుంటుందని రాష్ట్రీయ స్వయం సేవక్ నాయకులు యుగంధర్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో రూట్ మార్చ్ నిర్వహించారు. స్థానిక వీడీ రోడ్డు నుంచి మెయిన్ రోడ్డు, గాంధీ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, సద్భావన్, గురునాథ్ థియేటర్ మీదుగా వీడీ రోడ్డుకు ర్యాలీ చేరుకుంది. ఆర్ఎస్ఎస్ ఏర్పడి వంద సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా దేశ వ్యాప్తంగా ఒకే సమయంలో మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. ఇందు లో భాగంగా హిందూపురంలో కడా నిర్వహించారు. పెద్ద ఎత్తున ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి

పెనుకొండ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పెనుకొండ నియోజకవర్గానికి చెందిన పలువురికి బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత సీఎం సహాయనిధి చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. స్థానిక పార్టీకార్యాలయంలో బాధితులకు చెక్కులను అందజేశారు. మైలారప్పకు రూ.15వేలు, ఈశ్వరమ్మకు రూ.25వేలు, దీపిక రూ.20వేలు, పెద్దన్నకు రూ.87,709, మహబూబ్‌బాషకు రూ.16,670, నాగభూషణంకు 1,53,290, కళావతి కి రూ.20వేలు, సుకన్యకు రూ.1,67,727, మరో ఎనిమిది మందికి రూ.5,05,396ల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే కూటమి ధ్యేయమన్నారు. అత్యవసరవేళల్లో ఎవరైనా ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటే బిల్లులను పెనుకొండ క్యాంపు కార్యాలయంలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో కేశవయ్య, చిన్నవెంకటరాముడు, బాబుల్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా టీడీపీ సభ్యత్వ నమోదు

పెనుకొండ టౌన్, అక్టోరు 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశంపార్టీ చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ప్రారంభించారు. పెనుకొండ పట్టణంలోని స్థానిక పార్టీ కార్యాలయంలో పల్లె పట్టణం తేడాలేకుండా అన్ని ప్రాంతాల్లోనూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పెద్దఎత్తున చేపట్టారు. మంత్రి సవిత మాట్లాడుతూ టీడీపీలో కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు.